# విష్వక్సేన భగవద్గీత



రచన
కలియుగ నారద
తిరుమల - తిరుపతి

VISHWAKSENA BHAGAVAD GEETA

by Kaliyuga Narada, (Tirumala -Tirupati)

**ఓం నమో వేంకటేశాయ**

# విష్వక్సేన

# భగవద్గీత

**రచన:**

**కలియుగనారద**

**తిరుమల - తిరుపతి**

ⓒ 2016 సర్వహక్కులు రచయితవి. **mail id:** kaliyuganarada@yahoo.in

విజ్ఞప్తి : ఈ పుస్తకంలో ఏ భాగాన్నయినా పూర్తిగా కానీ, కొంతకానీ కాపీరైట్ హోల్డర్ మరియు రచయిత నుంచి ముందుగా రాత పూర్వకంగా అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

\- రచయిత

# విష్వక్సేన భగవద్గీత

**పరిచయం**


| | | |
|---|---|---|
| 1. | వేద దేవుడిని ఎప్పటికీ అవమానించాల్సిందేనా? | 1 |


**దేవుడు -జీవుడు**


| | | |
|---|---|---|
| 2. | భగవద్గీతలో దేవుడంటే... | 4 |
| 3. | ఏ 'మాయ' పరమాత్మ నుంచి దూరం చేస్తోంది? | 7 |
| 4. | పరమాత్మకు ఎలాంటి వారంటే ఇష్టం | 9 |


**ఆత్మ - నిష్కామకర్మ**


| | | |
|---|---|---|
| 5. | ఆత్మజ్ఞానంతో పరమశాంతి...సంపూర్ణ స్వేచ్ఛ | 11 |
| 6. | ఆత్మను నీరు, నిప్పు, గాలి, భూమి, ఆకాశం ఏమీ చేయలేవు... | 13 |
| 7. | పాప విముక్తికి... నిష్కామకర్మ ఉత్తమం | 15 |


**మనస్సు - స్థితప్రజ్ఞత**


| | | |
|---|---|---|
| 8. | నీరు, నిప్పు, గాలి ఏమీ చేయలేని ఆత్మను.... గుణాలు నాశనం చేస్తాయా? గుణాలు ఆత్మను నాశనం చేసేంత శక్తివంతమైనవా? | 20 |
| 9. | మనసును... ఆత్మను రక్షించే "స్థిత ప్రజ్ఞత" | 22 |


**శరీరం - ఇంద్రియ నిగ్రహం**


| | | |
|---|---|---|
| 10. | జీవన్ముక్తికి శరీరాన్ని అర్థం చేసుకోవటం కీలకం | 24 |
| 11. | ఆత్మతోనే ఇంద్రియ నిగ్రహం... | 25 |


**మరణం - జీవన్ముక్తి**


| | | |
|---|---|---|
| 12. | దేహత్యాగం సమయంలో ఎలా వుండాలి? | 27 |
| 13. | మరణానికి ముందే జీవన్ముక్తి... | 29 |

## వేద దేవుడిని

# ఎప్పటికీ అవమానించాల్సిందేనా?

### విశ్వగురువు విష్వక్సేనుల ఆజ్ఞతో... వేదదేవుడు అర్జునుడిని భగవద్గీత నుంచి తొలగిస్తున్నాం...

పక్కన కన్పిస్తున్న చిత్రాన్ని ఎలా అర్థం చేసుకోవాలంటే...
అర్జునుడు - వేదాల్లో దేవుడైన ఇంద్రుడు...
కృష్ణుడు - ఉపనిషత్తుల దేవుడు...

వేదాల దేవుడైన ఇంద్రుడు.... ఉపనిషత్తుల దేవుడి ముందు ఆత్మ విద్యకోసం ఇలా ప్రాదేయపడుతున్నాడు. అది ఆ చిత్రం అర్థం...

దేవుడికి బలి ఇవ్వాలి, యజ్ఞం చేయాలని వేదం చెపుతుంది.

తాత్వికమతం గుణాలు మార్చుకోవాలి, ఆత్మతత్వం గ్రహించాలని చెపుతుంది.

ఈ రెండు సిద్ధాంతాల మధ్య స్పర్థ హిందుమతం. అందులో భాగమే ఈ చిత్రం.
హిందుమతంలోనే కాదు... ప్రపంచంలోని అన్ని మతాల్లోనూ ఇదే గొడవ. 'బ్రహ్మోత్సవ' ఉపనిషత్తు చదవండి అన్ని మతాలు అర్థం అవుతాయి. ఈ ఆధ్యాత్మిక ఆటకు అన్ని మతాల్లోనూ వున్న విశ్వగురువు.... విష్వక్సేనుల వారు ముగింపు పలికారు. అర్జునుడిని భగవద్గీత నుంచి తొలగించారు.



ఈ "విష్వక్సేన భగవద్గీత' ను చదవటానికి ముందు దయచేసి "బ్రహ్మోత్సవ ఉపనిషత్తు"ను చదవండి. ఆ తరువాత ఈ భగవద్గీతను చదివితే మరింత చక్కగా అర్థం అవుతుంది.
వైదికులకు వేదం ఎలాగో...
తాత్వికులకు భగవద్గీత అలాగ...
మహాభారతంలో భగవద్గీత భాగం కాదు.
భగవద్గీత ఎప్పటి నుంచో వుంది. ఆ తరువాత అందులో మార్పులు చేసి... మహాభారతంలో భాగం చేశారు.
మొట్టమొదట భగవద్గీత ఎలా వుండేది? అంటే "విష్వక్సేన భగవద్గీత"లాగా వుండేది.
అర్జునుడిని కలపటం.. మహాభారతంలో భాగం చేయటం ఇవ్వన్నీ తరువాత జరిగింది.
మహాభారత యుద్ధానికి భగవద్గీతకు సంబంధం లేదు.
వేదాన్ని అవమానించాలనే అలా ఆ రోజుల్లో మార్పులు చేశారు.
ఇంతకూ అర్జునుడు ఎవరు? ఆయన్ను భగవద్గీత నుంచి ఎందుకు తీసేస్తున్నాం... ఈ అధ్యాయంలో తెలుసుకుంటాం.

### కృష్ణుడు.. ముందు మోకాళ్లపైన అర్జునుడు...
### ఉపనిషత్తుల ముందు మోకాళ్లపైన వేదం...

వేద క్రియలు, బలులు ఇవ్వటం - వేదం
ఆత్మ తత్వంతో గుణాలను మార్చుకోవటం తాత్వికం
ఈ రెండు సిద్ధాంతాల మధ్య వైరుధ్యం... వైషమ్యమే హిందుమతం.
ఈ దృశ్యం మొత్తం ప్రపంచంలోని మతాలకు అద్దం పడుతుంది.
వైదిక దేవుడైన ఇంద్రుడు... ఉపనిషత్తు దేవుడైన విష్ణువు ముందు... ఆత్మ విద్య కోసం ప్రదేయపడటం
ఇది వేదాలను తీవ్రంగా అవమానించటమే.
వేద బలులు, క్రియలు తప్పు అని చెప్పటానికి వేద ప్రక్రియ చేసే వారు దేవుడుగా భావించే ఇంద్రుడే స్వయంగా ఉపనిషత్తుల దేవుడి ముందు "దేహీ" అని ఆత్మ విద్యకోసం చేతగాని వాడిలా... సాగిలపడటం.
"బ్రహ్మోత్సవ ఉపనిషత్తు" గ్రంథంలో ప్రపంచ వ్యాప్తంగా ఈ రెండు సిద్ధాంత మధ్య వైరుధ్యం వల్ల ఏం జరిగిందో వివరంగా ఇచ్చాం. హిందుమత ప్రభావం క్రైస్తవంపై పడి అక్కడ ఇదే గొడవ. అదే ప్రభావం ఇస్లాంపైనా పడింది.
మొత్తంపైన రెండు సిద్ధాంతాల మధ్య గొడవ హిందుమతంలో ఆలయాల వ్యవస్థతో ముగిసింది.

### అర్జునుడు...కృష్ణుడు ముందు ఇంకా సాగిలపడాలా?

ఆ రోజుల్లో వేదాన్ని వ్యతిరేకించాలని ఇలా వేద దేవుడిని...

ఉపనిషత్తుల దేవుడి ముందు మోకాళ్లపై కూర్చోబెట్టారు. ఇప్పుడు ఆలయ వ్యవస్థలో రెండూ ఒకటి అయిపోయాక... ఇక ఈ వైషమ్యం అవసరమా? ఈ చిత్రం అవసరమా?

## ఆత్మతత్వంతోనే పరమాత్మను తెలుసుకోవటం సులభం...

ఉన్నది ఒకటే దేవుడు. ఆ దేవుడిని తెలుసుకోవటానికి... అనుభూతి చెందటానికి ఆత్మతత్వం సులభమార్గం.
యజ్ఞాలు, బలులతో దైవాన్ని తెలుసుకోవటం అసాధ్యం. దేవుడిని ప్రేమించటానికి ఓ వేదిక. ప్రాథమిక దశలో ఓ సోపానం అవుతుంది.

## ఏ దేవుడిని తిట్టినా.. మన దేవుడిని తిట్టినట్టే...

అర్జునుడు... కృష్ణుడి ముందు సాగిలపడే చిత్రాన్ని తీసేయమని విశ్వగురువు శ్రీ విష్వక్సేనుల వారు ఆజ్ఞ.
ఏ పేరుతో పిలిచినా... దేవుడు ఒక్కడే...
ఒకరి దేవుడిని అవమానిస్తే... మన దేవుడిని అవమానించుకున్నట్టే...
వేద దేవుడిని అవమానించినా.. దేవుడిని అవమానించినట్టే...
అందువల్ల భగవద్గీత ముఖ చిత్రంలో కృష్ణుడి ముందు మోకాళ్లపైన అర్జునుడు వుండే చిత్రాన్ని ముద్రించలేదు. అధ్యాయాల్లో సయితం అర్జునుడి ప్రస్తావనతో వున్న అంశాలు కన్పించదు.

## వేద దేవుడిని అవమానించకూడదని... అర్జునుడిని తొలగించాం....

విష్వక్సేన భగవద్గీతలో అందుకే అర్జునుడి పాత్ర కూడా కన్పించదు. వేదాలను గౌరవించేదీ లేదు... అవమానించేదీ లేదు. అని గురువు గారి ఆదేశం మేరకు ఆత్మతత్వాన్ని అర్జునుడికి చెప్పినట్టు ఈ భగవద్గీతలో ఇవ్వటం లేదు.
విశ్వగురువు విష్వక్సేనుల వారికి పరమాత్మ చెపుతున్నారు.
అదే తీరులో మనం "విష్వక్సేన భగవద్గీత"ను చదవబోతున్నాం.

## అనేక వక్రీకరణలను తొలగించాం...

భగవద్గీత దైవ గ్రంథం. అందులో వక్రీకరణలున్నాయి. వాటిని విష్వక్సేనుల వారు తొలగించమన్నారు. తొలగించాం.

### 1. వేదాన్ని అవమానించకూడదని... అర్జునుడిని పాత్రను తొలగించటం :

భగవద్గీతలో తొలగించిన దానిలో అర్జునుడి పాత్ర ఒకటి. ఎందుకంటే... మొదటి అధ్యాయం మొత్తం అర్జునుడు దౌర్భల్య మనస్తత్వం... వేదాన్ని అవమానించటానికే. మొదటి అధ్యాయం మొత్తం కృష్ణుడు ఒక్క మాట కూడా మాట్లాడడు. అలాగే అర్జుడిని పాత్ర వచ్చిన ప్రతి చోట అర్జునుడిని తీవ్రంగా అవమానించటం తప్ప మరొకటి లేదు. వేదాన్ని అవమానించటం కోసమే ఇలా అనేక శ్లోకాలున్నాయి. అందువల్ల అర్జునుడి పాత్రను విష్వక్సేన భగవద్గీతలో పూర్తిగా తొలగించాం.

### 2. రాజీ తరువాత వక్రీకరణలను తొలగించాం :

వేదానికి, ఉపనిషత్తులకు రాజీ కుదిరి... ఉపనిషత్తులను వేదాంతంగా చేర్చుకున్నా.... భగవద్గీతలో కూడా వేదానికి అనుకూలమైన వక్రీకరణలు జరిగాయి.
అ) దేవుడుగా జంతులను, పక్షలను, ప్రకృతిని చేర్చటం రెండు రకాలుగా వక్రీకరణే.
ఆ). ఉపనిషత్తులు ప్రకృతిని దేవుళ్లుగా అంగీకరించదు. ఆత్మను ఏమీ చేయలేని ప్రకృతిని తాత్వికం భగవంతుడిగా అంగీకరించదు. భగవద్గీతలో కూడా శ్లోకాలున్నాయి. అయితే వేదంతో రాజీ తరువాత పంచభూతాలను దేవుళ్లుగా అంగీకరింపజేసే యత్నం వల్ల ఈ గందరగోళాన్ని భగవద్గీతలోకి తెచ్చారు.
ఇ). సింహం... గరుడుడు... ఇలా ఉత్తమమైనది మాత్రమే దేవుడు అని చెప్పటం సమస్తప్రాణులను సమదృష్టితో చూసే తాత్విక చింతనకు దూరం. ఇది కూడా వక్రీకరణే.
ఈ) ముక్తికి ప్రధానమైనది... సమత్వభావన అని పదే పదే భగవద్గీతలో చెప్పిన పరమాత్మ. ఇలా ప్రకృతిలో ఉత్తమ మైనవి మాత్రమే తాను అని చెప్పలేదు. తనకు ఎవరు ఇష్టులనే విషయంలో కూడా గుణాలనే పేర్కొన్నారు. ప్రకృతిలో ఉత్తమం వుండదు. ఆత్మకు వుండాల్సిన ఉత్తమ గుణాలనే చెప్పేది తాత్వికం. భగవద్గీత తాత్వికం. కాబట్టి ప్రకృతిలోని ఉత్తమమైనదనే భావన వైదికం నుంచి వచ్చింది. వైదిక వక్రీకరణలను తొలగిస్తున్నాం.
ఉ) నాలుగు వర్ణాలను తెచ్చి భగవద్గీతలో చేర్చాలనే వైదిక కుట్ర. కాబట్టి ఉత్తమజాతిని పక్షులు, జంతువుల నుంచి మొదలు పెట్టి.. మనుషుల వరకు తెచ్చారు. కాబట్టి జంతువులు, రుతువులు, పక్షుల్లో ఉత్తమమైనవి తాను అని చెప్పిన వాటిని తొలగించాం.
ఊ) నిష్కామకర్మ గురించి చెప్పిన తరువాత, సన్యాసాన్ని గురించి చెప్పటం కూడా వక్రీకరణే.
ఎ) యజ్ఞాలు చేయవద్దని, యజ్ఞాలు చేయమని పరస్పర విరుద్ధంగా కొన్ని శ్లోకాలున్నాయి. ధార్మిక వేదికలు దీనిపై స్పష్టతకు రావాల్సిన అవసరం వుంది.

### 3. వర్ణ వ్యవస్థను తొలగించాం :

భగవద్గీతను బాగా జీర్ణం చేసుకుని ఆచరిస్తే... ఇంత మంది దేవుళ్లు... వర్ణాలు... కులాలు... మతాలు కూడా కన్పించవు. దేవుడు వర్ణం గురించి చెప్పాడని చెప్పి భగవద్గీతలో రాసిన శ్లోకాలను తొలగించాం.
సమత్వ భావంతోనే ముక్తి అని పదే పదే చెప్పిన భగవద్గీతలో రెండు సిద్ధాంతాల రాజీ తరువాత వచ్చి చేరిన వక్రీకరణే వర్ణ వ్యవస్థ. అందువల్ల భగవద్గీత నుంచి వర్ణవ్యవస్థ ప్రస్తావనను తొలగించాం. ఈ తొలగింపులన్నీ విష్వస్సేనుల అనుమతితోనే చేశాం.

## మిగిలిన మత పవిత్ర గ్రంథాల్లోనూ..,

మిగిలిన మత పవిత్ర గ్రంథాల్లో కూడా ఇలాగే చాలా పరస్పర విరుద్ధమైన అంశాలు వందలాదిగా వున్నాయి.

వాటికి కారణం కూడా వేద బలులు... ఉపనిషత్తుల మధ్య వైషమ్యమే. ఆ వివరాలను "బ్రహ్మోత్సవ ఉపనిషత్తు"లో ఇచ్చాం. వారూ వాటిని పరిష్కరించుకోవాల్సిన అవసరం వుంది.

### విష్వక్సేనుల ఆజ్ఞతోనే..

సత్యంతో అసత్యాన్ని కడిగేయటంతో మాత్రమే హిందుమతాన్ని రక్షించుకోగలం. అదే విష్వక్సేనుల ఆజ్ఞ. అందుకే ఈ పని చేస్తున్నాం. ఈ పని చేయటంలో మేము నిమిత్తమాత్రులం.

### భగవద్గీత ఏం చెపుతుంది?

భగవద్గీత అయిదు విషయాలను గురించి చెపుతుంది.

ఎ) దేవుడి గురించి,

బి) ఆత్మ గురించి,

సి) మనస్సు గురించి,

డి) శరీరం గురించి,

ఇ) సమతాస్థితి, సమతా భావన గురించి

ఎఫ్) ముక్తి (జీవన్ముక్తి) గురించి

ఈ ఆరు అంశాల గురించి అక్కడక్కడ చెల్లా చెదురుగా శ్లోకాలు వున్నాయి. సరిగ్గా అర్థం చేసుకోవటానికి "విష్వక్సేన భగవద్గీత"ను శ్రీ విష్వక్సేనుల వారి వద్ద ఆధ్యాత్మిక విద్యార్థిగా... మాత్రమే అందిస్తున్నాం.

భగవద్గీతను చదవాలనే ఆసక్తి కలగాలంటే... భగవద్గీత చదవటం వల్ల అందబోయే జ్ఞానం గురించి కాస్త అవగాహన అవసరం. అందువల్ల భగవద్గీత ఏఏ అంశాలను చర్చిస్తుందో ఒక్కో అంశంలో క్లుప్తంగా పరిచయం చేసుకుంటే... ఆత్మ, మనస్సు, శరీరం గురించి చెపుతుంది.

### ఆత్మగురించి....

1. భగవద్గీత ఆత్మ గురించి చెపుతుంది.
2. ఆత్మ విద్యను బోధిస్తుంది.
3. పాపవిముక్తికి... నిష్కామ కర్మ సరైన మార్గం అని చెపుతుంది. గత జన్మపాపాల నుంచి కూడా నిష్కామకర్మ వల్లే విముక్తి లభిస్తుందని స్పష్టం చేస్తుంది.

### మనస్సు గురించి...

ఒక జన్మ నుంచి మరో జన్మకు ఆత్మతో పాటు వెళ్లేది మనస్సు. మనస్సులోనే గుణాలుంటాయి. ఏఏ గుణాలతో వున్న వారు ఎలా వుంటారు. వారు ఏం చేస్తే గుణాలు మార్చుకోగలరు. గుణాలే లేని గుణాతీత స్థితికి చేరుకోవాల్సిన ఆవశ్యకత ఇలాంటి మనస్సుకు సంబంధించిన విషయాలు భగవద్గీత చెపుతుంది.

అందుకు స్థిత ప్రజ్ఞత స్థితి కోసం చేసే యత్నం ఎలా ఉపయుక్తం అవుతుంది? తెలుసుకుంటాం.

### శరీరం గురించి...

భగవద్గీత శరీరానికి, ఆత్మకు వున్న బంధం ఎలాంటిది? దేనిపైన దేని ప్రభావం ఎలా వుంటుంది? శరీరం ప్రభావం ఆత్మపైన, మనస్సుపైన పడకూడదంటే ఏమి చేయాలి? ఇలా ఆధ్యాత్మిక ఉన్నతిని అడ్డుకునే శరీర ప్రభావంపైన కూడా శాస్త్రీయంగానే చర్చిస్తుంది.

### ఆత్మ.... శరీరం... మనస్సులతో...
### భూమిపై వున్నపుడే... జీవన్ముక్తి..
### భగవద్గీత బరోసా...

భగవద్గీత... ఆత్మకు.. మనస్సుకు.. శరీరానికి వున్న అనుబంధాన్ని చాలా విపులంగా చర్చిస్తుంది.

ఆత్మ విద్యతో ఆత్మను ప్రక్షాళన చేసుకుని...

మనస్సును కూడా ఆత్మ నియంత్రణలోకి వెళ్లేలా చేయటం తెలుసుకుంటే...

శరీరాన్ని అదుపులో పెట్టుకోవటం చాలా సులభం.

శరీరం మనస్సు చెప్పినట్టు వినేలా చేయటం..

మనస్సు ఆత్మ చెప్పినట్టు వినేలా చేయటం..

ఆత్మ పరమాత్మ ఆదేశాలను పాటించటం ఈ మూడు దశలు దాటితే జీవన్ముక్తే.

కొన్ని మతాల్లో చనిపోయిన తరువాత పరలోకానికి వెళ్లటం ఎన్ని వేల కోట్ల సంవత్సరాలు పడుతుందో తెలియదు. ఆ వివరాలు "బ్రహ్మోత్సవ ఉపనిషత్తు" గ్రంథంలో ఇచ్చాం. చూడగలరు.

భగవద్గీత మాత్రం ఈ లోకంలో వున్నపుడే... ఎవరికి వారికే తాము పరలోకంలో పరమాత్మ వద్దకే వెళ్తామని తెలిసేలా చేస్తుంది.

అంతేకాదు... భూమిలో వున్నపుడే "జీవన్ముక్తి"ని నేర్పిస్తుంది.

### భగవద్గీత శ్లోకాల్లోని
### ముత్యాలను... వజ్రాలను వేరు వేరుగా...

విష్వక్సేన భగవద్గీతలో ఇచ్చిన విషయాలన్నీ ప్రస్తుతం వున్న భగవద్గీతలోనివే. ఆయా శ్లోకాల సంఖ్యను ప్రతి అధ్యాయంలో ఇచ్చాం. ముత్యాలను, రత్నాలను, వజ్రాలను, వైడూర్యాలను వేరు వేరు చేసి ఒక్కో అధ్యాయంగా అందించాం. ఒక అధ్యాయం మొత్తం ముత్యాలుంటే... మరో అధ్యాయంలో వజ్రాలుంటాయి. ఇప్పుడున్న భగవద్గీతలో అన్నీ ఒకే చోట కుప్పపోసినట్టు వుంటే... అన్ని వుంటే... వాటిని జాగ్రత్తగా... భక్తితో... గౌరవంతో... విశ్వగురువు ఆదేశంతో వేరు చేసి చక్కగా అర్థమయ్యేలా ఈ "విష్వక్సేన భగవద్గీత"ను అందించాం.

# భగవద్గీతలో దేవుడంటే...

దేవుడు అంటే ఎవరు? ఎక్కడ వుంటారు? ఎలా వుంటారు? వారిని ఎలా తెలుకునేది? ఆయన ఎలా ప్రేమించేది? ఎంత మంది దేవుళ్లు? భగవద్గీతలో దేవుడి గురించి ఏం చెప్పింది? భగవద్గీతలోని వివిధ అధ్యాయాల్లో దేవుడి గురించి ఏమి వుందో ఒకే చోట చదివితే స్పష్టంగా అర్థం అవుతుంది. అందుకే ఈ అధ్యాయంలో భగవద్గీతలో దేవుడి గురించి ఏమని వుందో తెలుసుకుందాం.

## విశ్వాన్ని అగోచరంగా వ్యాపించినవారే పరమాత్మ

దేవుడంటే ఎవరు? భగవద్గీతలో దేవుడి గురించి ఏం చెప్పారు. వ్యాసుల వారికి పరమాత్మ తన గురించి ఏం చెప్పారు? వివిధ అధ్యాయాల్లో దేవుడి గురించి వున్న శ్లోకాలను బట్టి దేవుడిని అర్థం చేసుకుందాం....

పరమాత్మ నిత్యుడు. గతంలో, వర్తమానంలో, భవిష్యత్తులో ఆయన నిత్యుడై వుంటారు. (2.12)

ఆ పరమాత్మ అంతటను చేతులను, కాళ్ళను, కండ్లను, తలలను, ముఖాలను, చెవులను కలిగివున్నారు. లోకములన్నిటిలోనూ వ్యాపించి వున్నారు. (13:14)

పరమాత్మను ఏ కర్మ ప్రభావితము చేయజాలదు. పరమాత్మ ఎలాంటి కర్మఫలమును ఆశించరు. ఆయన్ను గురించి ఈ సత్యాన్ని తెలుసుకున్న వారు సయితం.. కర్మఫలాలు బాధించవు. (4:14)

ఎవ్వరు ఏ విధముగ నన్ను ఉపాసించుచున్నారో వారిని, ఆ విధంగానే నేను అనుగ్రహించుచున్నాను. (4:11)

**శ్రేష్టుడు** : నాకంటె శ్రేష్ఠమైనది వేరొక్కటిలేదు. కనబడుచున్న ప్రపంచమంతా, సూత్రంలో మణులు కూర్చబడినట్టు... నాయందు కూర్చబడియున్నది. (7:7)

**నాశరహితుడు** : భూతమయ ప్రపంచానికి కారణమైన అవ్యక్తం కంటె ఉత్కృష్టమై , అగోచరమై , శాశ్వతమై ఉండే పరబ్రహ్మ సమస్త ప్రపంచాలు (నశించాల్సి వచ్చినా) నశించినా ఆ పరబ్రహ్మ నశించదు.(8:20)

## ప్రాణకోటిని వ్యాపించి వున్నవాడు...

ఎవరిలో ఈ ప్రాణికోటి జీవిస్తోంది. ఎవరు ఈ ప్రాణికోటి అంతటా వ్యాపించి ఉన్నాడో అట్టి పరమపురుషుడు. (8 : 22)

**<u>సకల జగత్తుకు ఉత్పత్తి లయములకు కారణము</u> :** సకల భూతాలు ఈ (జడం, చేతనం) రెండు విధాలైన ప్రకృతిచేతనే కలుగుతున్నాయి. సకల జగత్తుకు ఉత్పత్తి లయములకు కారణము నేనే.(7:6)

## సమస్తజీవులకు ఆధారభూతుడు...

వాయువు ఎల్లయెడల సంచరించగలిగినా, ఎల్లప్పుడు ఆకాశం పరిధిలోనే ఉనికి కలిగివుంటుంది. అలాగే సమస్త జీవరాశులు నాలోనే ఉండి , నాపైనే ఆధారపడి వున్నాయి. (9:6)

## సృష్టిలయాలను రెండింటినీ పరమాత్మే చేస్తూంటే పరమాత్మకు కూడా పాప పుణ్యాలు వుండాలి కదా?

ఆ కర్మలలో ఆసక్తిలేకుండా ఉదాసీనంగా ఉన్న నన్ను ఆ కర్మలు బంధించవు. (9: 9)

## చరాచర జగత్తును సృష్టిస్తున్నది ఎవరు?

నా ఆధ్వర్యం క్రింద ఈ ప్రకృతి చరాచర జగత్తును సృష్టిస్తోంది . ఈ కారణం చేతనే ఈ జగత్తు పరివర్తన చెందుతోంది.(9: 10)

ఈ జగత్తుకు నేనే తల్లిని , తండ్రిని, తాతను , కర్మ ఫలదాతను, పవిత్రము , ఓంకార ప్రణవ స్వరూపము అని తెలియదగిన (ఏకైక) విషయాన్ని నేనే. (9: 17)

## జ్ఞానులు మిమ్మల్ని ఎలా దర్శిస్తున్నారు?

నేను సకల జగత్తునకు ఉత్పత్తి కారణభూతుడుగా జ్ఞానులు ధ్యానముతో నన్ను భజిస్తున్నారు. (10:8)

## సృషి... స్థితి... లయలకు కారణం వేరు వేరు దేవుళ్లా?

నేనే గమ్యస్థానము , ప్రభువు , సమస్తం భరించే వాడిని , సాక్షిని నేనే , శరణు పొంద తగినవాడను నేనే , స్నేహితుడను , సృష్టి స్థితిలయాలను చేసేవాడిని , పరమ నిధిని , నాశంలేని బీజరూపుడను. (9: 18)

ప్రాణుల ఆది... ప్రస్తుత స్థితి.. అంతాము నేనే. (10:20)(10:39)

## సృష్టిలో మానవుడు ఎవరివల్ల ఉనికిలోకి వచ్చారు?

నా మనస్సంకల్పముచే కలిగింపబడిన వారై పుట్టినవారు. (10:6)

## పరమాత్మ మిమ్మల్ని చరా చర సృష్టిలో అగోచరంగా వున్నారని ఎందుకు దర్శించలేకున్నారు?

నా విశ్వరూపాన్ని కేవలం అనన్య భక్తి చేతనే చూడగలరు. అంతే కాదు చూచి. దానిని గ్రహించి, దానిలో ఐక్యం కావడానికి కూడ ఈ

అనన్య శక్తి ఉండాలి. (11 : 54)

## సూర్యుడిని ప్రకాశింపజేసేవాడు..
ప్రాణులను కలుగజేసేవాడు. ప్రాణుల నిమాయకుడు, సూర్యుడిని ప్రకాశింప జేయువాడు, సకల ప్రపంచమును పరిపాలించు వాడు. (10:15)

## సకల ప్రాణుల్లో చైతన్యం
నేనే సకలప్రాణుల హృదయమున ప్రేరకుడు. (10:20)

ప్రాణులలో చైతన్యం (జ్ఞానశక్తి) నేనే. (10:22)

నేను సకలమైన ఈ జగత్తును ఒక అంశముచే వ్యాపించుకొని, లేక ధరించుకొని వున్నాను.(10:42)

చరాచరమైన సమస్త ప్రపంచమూ నా దేహంలోనే ఏకత్ర కూడి ఉంది. (11 : 7)

## దివ్యదృష్టితో తప్ప చర్మచక్షువులతో చూడలేవు
దివ్యదృష్టితో తప్ప నీ చర్మ చక్షువులతో నా ఈ దివ్యరూపాన్ని చూడలేవు. (11 : 8)

అనేక ముఖాలు , నేత్రాలు కలిగి, సర్వతోముఖుడై అనంతమైన దేవుడు (11.11)

## వెయ్యి సూర్యుల తేజస్సు
ఏకకాలంలో వేయి సూర్యులు ప్రకాశిస్తే ఎంతకాంతిగా ఉంటుందో ఆ దివ్యరూపం కాంతి దానితో సమానంగా అంత ప్రకాశంగా ఉంది.(11 : 12)

అన్నివైపులా అనంతరూపాలు కలవాడు. ఆది మధ్య అంతాలు లేనివాడు. (11 : 16)

## ప్రకాశమే రూపంగా కలిగిన వాడు...
ప్రకాశమే రూపముగా గలిగి సూర్యాగ్నుల తేజస్సును మించిన తేజస్సుతో చూడ శక్యం కానివాడవై అప్రమేయుడు. (11 : 17)

## ధర్మరక్షకుడు
ఓ ఈశ్వరా! నీవు పరమోత్కృష్టుడవైన పరబ్రహ్మవు, ఎల్లజగాలకు ఆశ్రయానివి, నశింపని వాడవు, ఊర్జితములైన ధర్మాలకు రక్షకుడవు. (11 : 18)

## ఆది.. మధ్య... అంతములు లేనివాడు..
ఆది.. మధ్య... అంతం లేని వారుగానూ, అనేక బాహువులతో, సూర్య చంద్రులు నేత్రాలుగా, అగ్నివంటి ముఖం కలిగిన నీ తేజస్సుతో ఈ సమస్త విశ్వమును తపింపచేయుచున్న వారుగా మిమ్మల్ని చూస్తున్నాను. (11 : 19)

## సమస్త దిక్కులూ వ్యాపించి వున్నవాడు...
భూమ్యాకాశాలను, దిగంతరాళాలను, సమస్త దిక్కులను కూడ నీవు ఒక్కడవే వ్యాపించి వున్నావు.(11 : 20)

## తప్పులు చేసే వారికి శిక్ష వేసేవాడా...
అనేక నదీప్రవాహాలు ఏ విధంగా సముద్రంలో ప్రవేశిస్తున్నాయో , ఆ విధంగానే ప్రజ్వలిస్తున్న నీ ముఖంలో నరలోక వీరులంతా ప్రవేశిస్తున్నారు. (11 : 28)

మిడుతలు మండుచున్న నిప్పులో అతి వేగంగా ప్రవేశించి ఎలా నశిస్తాయో అలాగే అనేక (పాపులు) ప్రాణులు అతి వేగంతో నీ ముఖంలో ప్రవేశించి నశిస్తున్నాయి. (11 : 29)

నేనీ ప్రపంచం మొత్తాన్ని నశింపజేయగల బలిష్ఠమైన కాలస్వరూపుడను. (11 : 32)

## ప్రపంచానికి ఆధార భూతుడవు...
అనంతుడు. ప్రపంచాలకు ఆధార భూతుడు. నాశములేని వాడు. (11 : 37)

మీరే ఆది దేవుడు. పురాణ పురుషుడు. విశ్వానికి పరమాధారుడవు , జ్ఞాతవు , జ్ఞేయమవు , పరమపదము మీరే. ఈ జగత్తుకు మీచే వ్యాప్తమై వున్నది (11 : 38)

## అన్ని దిక్కుల్లో నీకు నమస్కారం...
మీకు ముందు , వెనుక , ఎల్లదిక్కుల నమస్కారము. అమితమైన శక్తి పరాక్రమములు గలిగిన మీరు ఎల్ల జగాలలో నిండుగా వ్యాపించి వున్నారు. కావున సర్వస్వరూపుడు మీరే. (11 : 40)

## సమస్త జగత్తుకు నీవే తండ్రివి...
నీవు సాటిలేని ప్రభావములు కలవాడవు. చరాచరమైన ఈ సమస్త జగత్తుకు నీవు తండ్రివి, పూజ్యుడవు, పరమ గురువువు. మూడు లోకములందు నీకు సమానుడు లేడు. ఇంక నీ కంటె అధికుడు లేడు. (11 : 43)

## వేద యజ్ఞాలతో విశ్వరూపాన్ని చూడలేవు...
నీవు చూచిన నా ఈ రూపాన్ని చూడడానికి అందరికీ సాధ్యంకాదు. దేవతలు కూడ నా ఈ రూపాన్ని చూడడానికి నిత్యం ఆశిస్తూ ఉంటారు. నీవు చూచిన ఈ విశ్వరూపాన్ని వేదాధ్యయనం వల్ల, తపస్సు వల్ల, యజ్ఞ యాగాదుల వల్ల దానధర్మాల వల్ల కూడ చూడ శక్యం కాదు. (11 : 52,53)

సూర్యచంద్రుల ప్రకాశమంతా నాకు సంబంధించినదే అని తెలుసుకో. (15:12)

ప్రాణుల దేహాన్ని ఆశ్రయించి జఠరాగ్ని రూపంలో ప్రాణాపాన వాయువులతో చేరి వారు తినే నాలుగు ఆహారాన్ని జీర్ణం చేస్తున్నాను. (15:14)

## జ్ఞానస్వరూపుడు...

సమస్త ప్రాణుల హృదయములలో నేనే నివసిస్తున్నాను. వారిలోని జ్ఞానము నావల్లనే. (15:15)

## ప్రాణకోటిని పరిభ్రమింపచేసే వాడు...

సర్వభూతముల హృదయములందును అంతరాత్మయై వెలయుచున్నాడు. అతడు తన మాయాశక్తిచే ప్రాణికోట్ల నన్నిటిని యంత్రము పైనెక్కించి తిప్పునట్లు పరిభ్రమింప జేయుచున్నాడు. (భ్రమలో ముంచి సంసారమందు త్రిప్పుచున్నాడు.) (18 : 61)

## ధ్యానించవలసిన ఆ పరమపురుషుని లక్షణాలేవి ? (8:8)

ఆ పరమ పురుషుడు సర్వజ్ఞుడు. పురాణపురుషుడు సమస్త ప్రపంచాన్ని శాసించేవాడు. అణువుకంటె సూక్ష్మము. సర్వమునకు ఆధారము. చింతింప అలవిగాని స్వరూపంగలవాడు. సూర్యుని తేజస్సువంటి తేజస్సుగలవాడు. అజ్ఞానలక్షణమైన అంధకారానికి అతీతుడు. (8:9)

# ఏ 'మాయ' పరమాత్మ నుంచి దూరం చేస్తోంది...?

దేవుడు ఎవరో భగవద్గీతలో ముందు అధ్యాయంలోలా స్పష్టంగా పరమాత్మ గురించి చెప్పినా... ఎందుకు దేవుడి గురించి ఇంకా రకరకాల నమ్మకాలతో వున్నారు? ఏది సరైన మార్గం? దీనికి కూడా భగవద్గీతే సమామాధనం చెప్పింది. ఏం చెప్పింది? ఏఏ శ్లోకాల్లో చెప్పిందో ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

## ఓ పరమాత్మ! ప్రకృతి దేవుడా?

మనస్సు , బుద్ధి , అహంకారము ఎలా మాయా స్వరూపాలో అలాగే... భూమి , జలము , అగ్ని , వాయువు , ఆకాశము కూడా జీవుడిని మాయకు గురి చేస్తున్నాయి. ఈ ఎనిమిది నా మాయా స్వరూపాలే.( 7: 4)

## ప్రకృతిని, దేవుడుగా ఎందుకు పూజిస్తున్నారు?

భూమి , జలము , అగ్ని , వాయువు , ఆకాశము ఇవ్వన్నీ సంసార స్వరూపమైనవి. నికృష్టమైనవి. ఈ ప్రపంచాన్ని ధరిస్తూ... దీని కంటె ఉత్కృష్టమైనది... జీవభూతమైన మరొకటి వుంది అని తెలుసుకోలేని వారు అలా చేస్తున్నారు. (7 : 5)

## ప్రకృతి కంటే భిన్నమైన ఓ పరమాత్మా! మీ గురించి ఎందుకు తెలుసుకోలేక పోతున్నారు?

ప్రకృతి వల్ల కలిగే సత్త్వ, రజస్సు, తమో గుణాలువాటి వికారాలైన రాగద్వేషాల కారణంగా... వాటి కంటే విలక్షణుడైన (నన్ను) పరమాత్మను తెలుసుకోలేకున్నారు.(7: 13)

## పరమాత్మ, మిమ్మల్ని తెలుసుకునేందుకు అడ్డుగా వున్న మాయ గుణాల నుంచి బయటపడాలంటే ఏం చేయాలి?

కంటికి దివ్యంగా కనిస్తూ... త్రిగుణాత్మకమైన ఈ మాయ దాటడం సులభం కాదు. నన్ను ఎవరైతే శరణాగతి పొందుతున్నారో వారు మాత్రము ఈ మాయను చాటగలరు.(7 : 14)

## చాలా మంది మాయను తొలగించమని మిమ్మల్ని ఎందుకు శరణు కోరటం లేదు?

పాపాత్ములు. మూఢులు. అసుర గుణాలుండటం వల్ల శరణాగతి పొందటం లేదు. (7 : 15)

## ఓ అంతర్యామి, మిమ్మల్ని ఆత్మతత్వంతో పొందటం సులభమని ఎందుకు గ్రహించటం లేదు?

నాశంలేనిది.. సర్వోత్తమమైనా నా స్వరూపాన్ని తెలుసుకోలేక. మనస్సు , బుద్ధి , అహంకారము భూమి , జలము , అగ్ని , వాయువు , ఆకాశము వంటి మాయాలకు అతీతుడయిన నన్ను... మానవ రూపం పొందిన వానిగా అవివేకులు తలుస్తున్నారు.(7 : 24)

## మీరు మానవ రూపం పొందలేదా? ఈ అజ్ఞానానికి కారణమేది ?

నా దైవ మాయచేత అందరికీ ప్రత్యక్షంగా కనబడటం లేదు. నాకు పుట్టుక... మరణం రెండూ లేదు. ఆ విషయం అమాయకులైన జనం తెలుసుకోలేకున్నారు.(7 : 25)

సమస్త ప్రాణికోటికీ ఈశ్వరుడైన నా పరమోత్కృష్ట భావాన్ని తెలుసుకోలేక మూఢమానవులు నన్ను మానవ దేహాన్ని ధరించిన ఒక వ్యక్తిగానే భావిస్తున్నారు. (9: 11)

నేనే పరబ్రహ్మను. నేనే అమరుడును, అవినాశి. అఖండ సుఖస్వరూపుడు అయిన పరబ్రహ్మను నేనే.(14 : 27)

జననములేనివాడు, నాశములేని జ్ఞానశక్తిగలవాడు, సర్వ ప్రాణులకు ఈశ్వరుడు(4:6)

నిత్యుడు. జననములేని వాడు. సర్వవ్యాప్తి. (10:12,13)

## ఈ కాలంలోని వారికి మాత్రం మిమ్మల్ని సశరీరంతో చూసే అవకాశం లేదా?

గతంలోనూ, ఇప్పుడూ, భవిష్యత్తు కాలాల్లోనూ ప్రతి ప్రాణి, ప్రాణి సమూహమూ నాకు తెలుసు. అయితే వారు నా నిజస్వరూపాన్ని తెలుసుకోలేరు. (7 : 26)

## స్వామి, మీ నిజస్వరూపాన్ని ఎందుకు తెలుసుకోలేరు?

ప్రతి జీవీ జన్మించగానే... రాగద్వేషాలు.. సుఖ దు:ఖాలనే ద్వంద్వాలకు సమ్మోహనులై.. అజ్ఞానంలో వుండిపోతున్నారు. (7 : 27)

## కొందరు మీ నిజస్వరూపాన్ని తెలుసుకుంటున్నారు? వారికెలా సాధ్యం?

ఎవరు తమ పాపాలను నశింపజేసుకుని తరువాత సుఖదు:ఖాది ద్వంద్వాలనుండి విముక్తులై దృఢమైన నిష్ఠతో నన్నే భజిస్తారో వారు తెలుసుకో గలుగుతున్నారు.(7 : 28)

## నిజస్వరూపాన్ని తెలుసుకోవాలంటే వేద అధ్యయనం చేయాలా?

వేదయజ్ఞ అధ్యయనాదులచేత, దానాది కర్మలచేత, ఉగ్రమైన తపస్సు చేత కూడ ఈ నా విశ్వరూపాన్ని చూడలేరు. (11 : 48)

## ఆత్మతత్వం తెలుసుకోలేని వారు ఏమవుతారు?
ఈ ఆత్మధర్మంలో శ్రద్ధలేనివారు మృత్యుముఖంలో పడి నన్ను చేరకుండానే మరల మరల ఈ సంసారంలో పడి జన్మలెత్తుతూ వుంటారు. (9: 3)

## మాయలో వున్న వారిలో భగవంతుడిని ఉనికి వుంటుందా??
వాస్తవంలో ఈ ప్రాణికోటి ఉనికి నాలోలేదు. పవిత్రమైన నా యోగ శక్తిని చూడు. నేనా ప్రాణికోటిని సృష్టించి రక్షించేవాడినే అయినప్పటికీ నా ఉనికి ఆ ప్రాణికోటిలోలేదు. (9: 5)

## ఎక్కడో మారుమూల వుంటారు. గురువులూ వుండరు. అలాంటి వారిలో మాయను... ఎలా తొలగిస్తున్నావు?
ఎల్లప్పుడు నా చింతనలో మనస్సు గలిగిన వారికీ, ప్రీతితో భజించే వారికీ, వారు ఎలా నన్ను పొందవచ్చనే సత్యాన్ని వారి బుద్ధియోగం ద్వారా నేను వారికి ఇస్తున్నాను. (10:10)

ఆ భక్తులకు అజ్ఞానమువల్ల గలిగిన సంసారమనే అంధకారాన్ని, వారి బుద్ధిలో ప్రకాశించే జ్ఞానమనే దీపం తోనూ, కారుణ్యం చేతనే పోగొట్టుతున్నాను. (10:11)

## దేహాభిమానం వున్న వారికి మాయ తొలగటం కష్టం
నిర్గుణ బ్రహ్మంపైన మనోనిష్ఠను కుదరటం దేహంపై అభిమానం వున్న వారికి కష్టసాధ్యం. దేహాభిమానం పూర్తిగా వదులుకోవటం ప్రయాస... అయినా... దేహాభిమానం పూర్తిగా తొలగితే గానీ, నిర్గుణ బ్రహ్మనిష్ఠ సాధ్యం కాదు.(12:5)

## భక్తుల్లో మిమ్మల్ని ఏ భావనతో కొలిచే వారు సర్వజ్ఞుడు?
ఎవడు బుద్ధి భ్రమ లేనివాడై, క్షర, అక్షరాలకు అతీతుడైన పురుషోత్తముడుగా నన్ను తెలుసుకొంటున్నాడో, అట్టివాడు సర్వజ్ఞుడు. అతడే పరిపూర్ణ భావముతో నన్ను భజిస్తున్నాడు. (15:18,19)

## సరైన ఆధ్యాత్మిక ఉన్నతి మార్గం ఎందుకు ఎంచుకోలేకున్నారు?
ఆసురీ సంపదలోని వారికి ప్రవృత్తి మార్గము, నివృత్తి మార్గము, అనే రెండు మార్గాలు వున్నట్టు తెలియదు. వారి ప్రవర్తనలో మంచి నడవడిక, సత్యం వుండవు. (16:7)
(ప్రవృత్తి అంటే పరమాత్మ నుంచి ప్రపంచంలోకి రావటం, నివృత్తి అంటే వెనక్కు మరలటం. అంటే... సంసారం నుంచి పరమాత్మ వైపుకు వెళ్లటం)
రాక్షస దృక్పథం వున్నవారికి. ఈ జగత్తుకు ఆధారమైన పరమాత్మ వున్నాడనే స్పృహ వుండదు. స్త్రీ పురుష కామం తప్ప.. మరేదీ ఈ సృష్టికి కారణం కాదని చెపుతారు. ఆత్మలేదని అల్పబుద్ధితో ప్రపంచ వినాశనానికి తగ్గ భయకరమైన పనులు చేస్తూ క్రూరులుగా సంచరిస్తుంటారు. (16:8,9)

సంతృప్తి పడని కామాన్ని ఆశ్రయించి ఆడంబరాలతో, గర్వం, మధం, అవివేకం వంటి దుర్గుణాలతో క్షుద్రపూజలను ఆశ్రయిస్తున్నారు. (16:10)

చచ్చిపోయే వరకు హద్దులేని కామం, భోగాలనే పరమార్థాలుగా భావించి... దానికంటే ఉన్నతమైనది ఏదీ లేదని అత్యదిక ఆశాపాశాలకు కట్టుబడి.. కామ క్రోదాలకు బానిసలై, అందుకు అవసరమైన దనంపైనే దృష్టి పెట్టి, తమ మనోభీష్టం నెరవేర్చుకుంటూ అన్యాయంగా జీవిస్తుంటారు. (16:11-12,13)

నేడు ఈ శత్రువును తుదముట్టించాను. మిగిలిన వారిని కూడా అచిరకాలంలోనే ఇలాగే తుదముట్టిస్తాను. నా వల్లే ఇదంతా అయ్యింది. నేనే రాజును, నేనే భోగిని, సిద్ధపురుషుడను, బలవంతుడను, సుఖవంతుడను. అనుకుంటారు. (16:14)

నేను ధనవంతుడను, సత్కుల ప్రసూతుడను, నావంటివాడు మరొక డెక్కడున్నాడు? నేను యజ్ఞయాగాదులు దానధర్మములు చేస్తాను. సుఖిస్తాను. అని అజ్ఞానంతో మోహంతో మునిగి లెక్కలేని మనోభ్రమలకు లోనై మోహజాలాల్లో తగుల్కొని వాటిపై అసక్తితో, వినయం లేకుండా, దనమదం, గర్వంతో పేరు ప్రఖ్యాతుల కోసం క్రతువులు చేస్తున్నారు. తప్ప అందరిలో వున్న పరమాత్మను చూడలేకున్నారు. కామక్రోదాలతో ఆత్మను నాశనం చేసుకుంటున్నారు. (16:15-21)

## అన్య దేవతారాధన చేసే వారు ఎలాంటి ఫలితం పొందుతున్నారు?
అశాశ్వాతమైన ఐహిక సుఖాల కోసం ఏ భక్తులైతే అన్య దేవతలను శ్రద్ధతో ఆరాధిస్తున్నారో, విధివిధానాన్ని వదలి అన్యమార్గంలో నన్నే ఆరాధిస్తున్నారు.(9: 23)

ఈ సమస్త యజ్ఞాలలోను భోక్తను నేనే. యజ్ఞాదిపతిని నేనే. నాతత్వం తెలుకో లేకున్నారు. కనుక వారు పతనం చెందుతున్నారు.(9: 24)

దేవతల నారాధించేవారు దేవతలను, పితృదేవతల నారాధించేవారు పితృదేవతలను, భూతముల నారాధించేవారు భూతాలను, నన్ను ఆరాధించేవారు నన్ను పొందుతున్నారు. (9: 25)

## పరమాత్మ మిమ్మల్ని చరా చర సృష్టిలో అగోచరంగా వున్నారని ఎందుకు దర్శించలేకున్నారు?
నా విశ్వరూపాన్ని కేవలం అనన్య భక్తి చేతనే చూడగలరు. అంతే కాదు చూచి. దానిని గ్రహించి, దానిలో ఐక్యం కావడానికి కూడ ఈ అనన్య శక్తి ఉండాలి. (11 : 54)

# పరమాత్మకు ఎలాంటి వారంటే ఇష్టం

సింహం నేను, గరుడుడు నేను, ఇలా భగవద్గీతలో కొన్నిటిని మాత్రం తాను అని భగవంతుడు చెప్పాడు అని చెప్పటం ఎలా వక్రీకరణో ఈ అధ్యాయం చదివితే స్పష్టంగా అర్థం అవుతుంది.
భగవంతుడితో అనుబంధం ఎలా వుంటుంది?
మనిషి గుణాలు ఎలా వుంటాయి? ఈ రెండే ముఖ్యం అని భగవద్గీత ఎంత స్పష్టంగా చెప్పిందో ఈ అధ్యాయంలో స్పష్టంగా తెలుస్తుంది.

### పరమాత్మ మిమ్మల్ని పూజించేవారు ఎన్ని రకాలుగా వుంటారు?

వ్యాధులు మొదలైన దు:ఖాలు కలిగిన వాడు.
ఆత్మజ్ఞానం తెలుసుకోవాలనుకునేవారు..
సిరి సంపదలు కావాలనుకునేవారు.
అప్పటికే నన్ను తెలుసుకున్న బ్రహ్మజ్ఞాని ఈ నాలుగు విధాలైన వారు నన్ను భజిస్తున్నారు. (7:16)

### పరమాత్మ ఆ నలుగురిలో ఎవరంటే మీకు ఇష్టం?

పరమాత్మనైన నాయందే మనసును స్థిరంగా వుంచి, నన్నే సర్వోత్తమైన గతిగా భావించే జ్ఞాని శ్రేష్ఠుడు. చాలా జన్మలెత్తిన తరువాత సకలం నా స్వరూపమని గ్రహించిన అతనికి నేను చాలా ప్రియమైన వాడిని... ఇలాంటి వారు అరుదు. అందుకే అతడు నాకూ ప్రియమైన వాడు.(7:17,18,19)

### భక్తుల్లో ఇష్టుడు ఎవడు?

ఏ ప్రాణికి హాని చేయని వాడు.
అన్ని ప్రాణులకు స్నేహితుడు
కరుణ వున్నవాడు
అహంకారం, మమకారం లేనివాడు
సుఖ దు:ఖాలను సమయంగా చూసేవాడు.
ఓర్పు వున్నవాడు.
ఎప్పుడూ సంతోషంగా వుండేవాడు.
ధ్యానం చేసేవాడు.
మనస్సును స్వాధీనం చేసుకునేవాడు.
నా స్వరూపంపై నిశ్చయం గలవాడు.
మనస్సును, బుద్ధిని నాకు సమర్పించిన భక్తుడంటే నాకు ఇష్టం.(12:13,14)

### వ్యక్తిత్వం వున్న భక్తుడంటేనే దేవుడికి ఇష్టం...

ఎవ్వని వల్ల జనం భయపడటం లేదో... సమాజంలోని ప్రజలను చూసి ఎవ్వడు భయపడటం లేదో...సంతోషము, కోపం, భయం, మనస్సు కలత చెందటం వీటి నుంచి ఎవడు విడువబడినాడో... అతను నాకు ప్రియమైన వాడు. (12:15)

ఆపేక్షలేనివాడు, శుద్ధిగలవాడు, సామర్థ్యము గలవాడు, ఉదాసీనుడు, భయము పోయినవాడు, సకల స్వార్థాలూ విడచిన నా భక్తుడు అతడు నాకు ప్రియమైనవాడు. (12:16)

ఎవ్వడు సంతోషము, ద్వేషము, వ్యసనము, కోరిక లేకుండా.. శుభాశుభంలలో ఆసక్తిలేనివాడై భక్తిగా వుంటాడో అతడు నాకు ప్రియమైనవాడు.(12:17)

శత్రువు, మిత్రుడు, మానావమానాలు, శీతోష్ణ సుఖదు:ఖాలు వీటిలో సమమైనవాడూ, నిందాస్తుతులలో సమంగా వుండేవాడు... మౌనంగా వున్నవాడు... ఎంత లభించినా అందులో సంతోషం పొందిన వాడూ, పరమార్థ విషయాల్లో స్థిరబుద్ధిగలవాడుగా వుంటూ నాపై భక్తిగలవాడుగా వుంటే... అలాంటివాడు... నాకు ప్రియమైనవాడు. (12:18,19)

చెప్పబడియున్న అద్వేషము లేకపోవటం వంటి మోక్షసాధనాలైన ధర్మాలను నమ్మి నన్నే ఉత్తముడని గ్రహించి, ఎవ్వరు అనుష్ఠిస్తారో... అలాంటి భక్తుడు నాకు మిక్కిలి ప్రియమైనవారు. (12:20)

### వ్యాప్తి నారాయణుడిని... ఆ విధంగానే ధ్యానిస్తే ఏమవుతుంది? ఈ చరాచర సృష్టి మొత్తం పరమాత్మస్వరూపంగా భావిస్తే ఏమవుతుంది?

అనన్యమైన మనస్సుతో, తదేకధ్యానంగా ఎవరైతే ఎల్లప్పుడు నన్నారాధిస్తారో అటువంటి వారి యోగక్షేమాలను నేను వహిస్తాను. (9: 22)

### సర్వఆత్మలు ఉనికిలో వుండటానికి కారణం అవుతున్న పరమాత్మను అర్చించాలంటే ఏం చేయాలి? స్వ కర్మాచరణ కూడా స్వామిని అర్చిం చేందుకు దోహదపడుతుందా?

ఎవని నుండి సర్వభూతములు ఉత్పత్తి అవుతాయో, ఎవనిచే ఈ సర్వము పరివ్యాప్తమో, అతనిని స్వకర్మాచరణ మూలముగా అర్చించి మానవుడు సిద్ధిని పొందుతాడు. (18:46)

### బ్రహ్మత్వానికి అర్హుడు ఎవరు?

బ్రహ్మత్వం పొందాలంటే...

1. పరిశుద్ధ బుద్ధి గలిగి వుండాలి.
2. దేహాన్ని, ఇంద్రియాలను స్థైర్యంతో నిగ్రహించాలి.
3. శబ్దాది విషయములను త్యజించాలి.
4. రాగద్వేషములను విడనాడాలి.
5. వీలైనంత ఏకాంతంగా ధ్యానం చేయాలి.
6. ఆయా పూట స్వల్పంగా ఆహారం తీసుకోవాలి.
7. అహంకారాన్ని, గర్వాన్ని, క్రోధములను విడనాడాలి.
8. మౌనంగా, మనస్సును అదుపులో పెట్టుకుంటూ, వైరాగ్యసాధన చేస్తూ శాంత చిత్తతో వున్న వాడు బ్రహ్మత్వానికి అర్హుడు. (18:51,52,53)

## బ్రహ్మత్వం పొందినవాడు ఎలా వుంటాడు?

ప్రశాంతచిత్తుడుగా వుంటాడు.
అతడు శోకించడు.
వాంఛించడు. సర్వభూతాల పట్ల సముడై నా యందు పరమభక్తితో వుంటాడు. (18:54)

## బ్రహ్మత్వం పొందిన వాడు ఏం పొందుతాడు?

55. భక్తిచే అతడు నేను ఎవరైనదీ, ఏమైనదీ యథార్థంగా తెలుసుకోగలుగుతాడు. అలా నా గురించిన నిజం తెలుసుకున్న వెంటనే నాలో ప్రవేశిస్తాడు.(18:55)

నా యందే మనస్సును స్థిరపరుచుకో, నా యెడనే బుద్ధిని ప్రవేశ పెట్టు, ఇకపై నాయందే నివసిస్తామనే దానిలో సందేహం లేదు. (12:8)

## బ్రహ్మత్వం పొందిన వాడు ఆ తరువాత ఎలా జీవిస్తాడు?

సదా సర్వకర్మలను ఆచరిస్తున్నా... నా శరణు పొందటం వల్ల అతడికి, నా కృప వల్ల నిత్య, అవికార్య (మార్పులులేని), పదమును పొందుతాడు. (18:56)

## నిత్యం కర్మలను ఆచరిస్తున్నా... మిమ్మల్ని పొందటం ఎలా సాధ్యం?

సర్వకర్మలను మానసికముగా నాకు సమర్పించి, నన్నే పరమార్థముగా భావించుకొని, స్థిరబుద్ధిత్వం అవలంబించి, సదా నాయందే చిత్తము నిల్పు. (18:57)

## నా చిత్తాన్ని మీపైనే నిలిపి కర్మలను చేయటం వల్ల ఏమవుతుంది?

చితాన్ని నాయందే నిలిపి (కర్మలను చేయటం వల్ల), నీవు నా కృపవల్ల నన్ను చేరటానికి అంతరాయాలను అన్నిటినీ దాటుతావు. అహంకారముతో ఈ మాటలను పట్టించుకోలేదంటే... దారితప్పుతావు.(18:58)

## భక్తి భావముతో ఉపాసన చేసినంత మాత్రమున, పూర్ణసిద్ధి కలుగుతుందా? కర్మకాండను అనుసరించ అవసరం లేదా?

పత్రంగాని, ఫలంగాని, పుష్పంగాని, నీరుగాని ఎవరైనా భక్తితో సమర్పిస్తే పవిత్రమైన హృదయంతో పూర్ణ భక్తితో అర్పించినందున దానిని నేను స్వీకరిస్తాను.(9: 26)

## నిరంతరం ఉపాసించేవారా? ధ్యానించేవారా? ఎవరు నిన్ను తెలుసుకుంటారు..?

ఏ భక్తులు ఎల్లప్పుడు నీపై మనస్సు గలవారై నిన్ను ఉపాసిస్తారో... ఎవరు అవ్యక్తమైన (కనబడని).. నాశనం లేని... బ్రహ్మంగా నిన్ను ధ్యానిస్తున్నారో... ఈ ఇద్దరిలో ఎవ్వరు నీ యోగాన్ని బాగా తెలుసుకున్నవారు...? (12:1,2)

## సకల ప్రాణుల హితుడుగా వుంటూ... సర్వవ్యాపిగా ఉపాసించేవాడే...

ఇంద్రియాలను అణచి, సమబుద్ధితో... సకల ప్రాణులకు హితం కోరుతూ... మనస్సుతో భావించవీలులేనిది... కూటస్థమైనది... చలనం లేనిది... శాశ్వతమైనది... అంతటా వ్యాపించి వున్న నిర్గుణ బ్రహ్మను ఉపాసించేవారే నన్ను చేరుతారు.(12:3,4)

# ఆత్మజ్ఞానంతో పరమశాంతి... సంపూర్ణ స్వేచ్ఛ

భగవంతుడు భగవద్గీతలో తనకు ఇష్టమైన వాడు ఎలాంటి వాడో... ఏ జ్ఞానాన్ని నేర్చుకుంటారో చెప్పారు.
బ్రహ్మజ్ఞాని నేర్చుకునేదే ఆత్మతత్వాన్ని..
ఆత్మతత్వం నేర్చుకోవటం వల్ల ఈ జన్మలోనూ, దేహత్యాగం తరువాతా ఎలాంటి మేలు జరుగుతుందో భగవద్గీతలో అనేక శ్లోకాల్లో ఇచ్చారు. వాటిని ఒకే చోట అందించటమే ఈ అధ్యాయం లక్ష్యం.

### ఆత్మజ్ఞాని కానివారు ఎలా వుంటారు?
సంకట సమయాల్లో మనో దౌర్బల్యంతో (అధైర్యం), ఏది శ్రేయోదాయకమో నిర్ణయించుకోలేని సంశయంతో ఆత్మవిశ్వాసం లేనివారుగా వుంటారు.
(2: 2,3,6,7)

### కొందరు యజ్ఞక్రియలు చేస్తున్నారు. బలులు ఇస్తున్నారు. నేను తాత్విక మార్గంలో వున్నాను. ఏదీ సరైన మార్గం?
ఇతరులు అనుష్ఠించే మార్గం కంటే... స్వధర్మము శ్రేష్ఠం. శ్రద్ధతో, నమ్మకంతో అనుసరించి నడుచుకున్న వారు... ధర్మాధర్మములనే కర్మబంధము నుండి విముక్తులవుతున్నారు. (3: 31,35)

### జ్ఞానంతో పరమాత్మస్థితి... సంపూర్ణ స్వేచ్ఛ...
ఇదివరకు ఎందరో పరమాత్మను ఆశ్రయించి.. జ్ఞానమనే తపస్సుచేత కామక్రోధ భయాలను వీడి, పవిత్రులై పరమాత్మ స్థితిని పొంది స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. (4:10)

### జ్ఞానమార్గ దర్శనం
ఈ జ్ఞానాన్ని పొందిన పిమ్మట మళ్లీ మోహాన్ని పొందవు. సమస్త భూతాలను నీ ఆత్మలోనే చూడగలవు. లేదా నాలో చూడగలవు. (4:35)

### ఆత్మజ్ఞానంతో పాప విముక్తి...
సమస్త పాపాత్ముల కంటే మిక్కిలి పాపాత్ముడవైనప్పటికీ జ్ఞానం అనే ఓడ ద్వారా ఆ పాప సముద్రాన్ని దాటిపోగలవు. (4:36)

### ఆత్మజ్ఞానంతో సమస్త కర్మలూ భస్మం
ప్రజ్వలిస్తున్న అగ్ని కట్టెలనెట్లా భస్మం చేస్తుందో , అదేవిధంగా జ్ఞానాగ్ని సమస్త కర్మలను భస్మం చేస్తుంది. (4:37)

### ఆత్మజ్ఞానంతో సమస్త కర్మలూ భస్మం
కాబట్టి జ్ఞానంతో సమానమైన మరొకటి ఈ లోకంలోలేదు. (4:38)

### ఆత్మజ్ఞానంతో పరమశాంతి
ఇంద్రియాలను సంయమనం చేసుకొన్నవాడు , ఆత్మపై ఆసక్తుడు , శ్రద్ధగలవాడు జ్ఞానాన్ని పొందుతున్నాడు. అట్టి జ్ఞానాన్ని పొందిన తరువాత అచిర కాలంలోనే పరమశాంతిని పొందుతున్నాడు. (4:39)

### ఆత్మజ్ఞానం లేకుంటే సుఖం లేదు...
జ్ఞానంలేనివాడు , శ్రద్ధలేనివాడు , సంశయ స్వభావంతో నాశాన్ని పొందుతారు. సంశయించే స్వభావంగల వానికి ఈలోకంలేదు నరలోకమూ లేదు. ఎక్కడా సుఖమనేది అసలే లేదు. (4:40)

### ఆత్మజ్ఞానిని కర్మలు బంధించవు...
జ్ఞానం ద్వారా సంశయాలను పోగొట్టుకొన్న ఆత్మజ్ఞానిని కర్మలు బంధించవు.(4:41)

### ఆత్మజ్ఞానంతో అజ్ఞాన నాశనం...
ఆత్మజ్ఞానం చేత ఎవని అజ్ఞానం నశించిందో, వారి ఆ ఆత్మజ్ఞానం సూర్యుని వలె పరబ్రహ్మాన్ని ప్రకాశింపజేస్తుంది. (5:16)

### జ్ఞానం చేత పాపం నశిస్తే ఏమవుతుంది?
జ్ఞానంచేత పాపాలన్నిటినీ నశింప చేసుకొన్నవారు ఆ బ్రహ్మపైనే బుద్ధినినిలిపి ఆ బ్రహ్మయే ఆత్మ స్వరూపంగా ఎంచి , దానిలోనే నిష్ఠగలవారై , దానిని పరమగతిగా ఎంచి , పునరావృత్తి రహితమైన మోక్షాన్ని పొందుతున్నారు. (5:17)

### ఆత్మజ్ఞానంతో పాపం పోగొట్టుకున్న వారి తాత్విక చింతన ఎలా వుంటుంది?
విద్యా వినయాలతో కూడిన ఆత్మగుణాలను పొందిన జ్ఞానులనైనా, గోడ మీద పిల్లిలాంటి మనిషి గుణాలున్న వారినైనా, జంతు గుణాలున్న మనుషులైనా జ్ఞానులు సమదృష్టితోనే చూస్తారు. (5:18)

### ఎలాంటి వారికి పరమాత్మ దర్శనం లభిస్తుంది?
సకల జీవుల్లో పరమాత్మ వుంటారని, సకల జీవులు పరమాత్మలో వుంటాయని చూడగలిగిన వారు ఎవరైతే వున్నారో... అలాంటి వారికి నేను కనబడకుండా వుండను. వారూ నన్ను దర్శించకుండా వుండరు. (6:30)

జనమరణ రహితమైన మోక్షాన్ని ఆపేక్షించి , నను ఆశ్రయించి ,

అందుకు తగిన ప్రయత్నాలను ఎవరు చేస్తున్నారో , అట్టివారు సమస్త జీవకోటికి అంతర్యామిగా ఉండే ఆ పరబ్రహ్మను , సమస్త కర్మలను తెలుసుకొంటున్నారు. (7 :29)

**ఆత్మజ్ఞానులు ఎలా వుంటారు?**
ఆత్మజ్ఞానము గలవారు మరణించిన వారిని గురించి, బతికివున్న వారి గురించి దు:ఖించరు. (2.11)

**ఆత్మజ్ఞానులు దు:ఖం లేకుండా ఎలా వుంటారు?**
శరీరానికి బాల్యం... యవ్వనం... ముసలితనంలలో మార్పులు వుంటాయి. అయితే శరీరంలోని ఆత్మ బాల్యంలోనూ... ముసలితనంలోనూ ఒకేలా ఎలాగైతే వుంటుందో... అలాగే దేహంలోని జీవాత్మ ఇప్పుడు వున్నట్టే... గతంలోనూ వుంది. భవిష్యత్తులో కూడా వుంటుంది. ఈ విషయం ఆత్మజ్ఞానులకు తెలుసు. అందుకే వారు దు:ఖించరు. (2.12,13)

**ఆత్మజ్ఞానంతో అశుభాల నుంచి విముక్తి...**
పరమరహస్యమైన ఉత్తమ జ్ఞానాన్ని విజ్ఞాన సహితముగ తెలుసుకోవటం వల్ల నీవు సర్వ అశుభముల నుండి విముక్తి పొందగలవు. (9: 1)

**ఆత్మవిద్య ఆచరణకు ఉత్తమం... ధర్మయుక్తం...**
అతి రహస్యమైన ఈ ఉత్తమ జ్ఞానము అతి పవిత్రమైనది , ఉత్తమమైనది, ప్రత్యక్షంగా తెలుసుకోతగినది , ధర్మ యుక్తమైంది. నాశన రహితమైనది , ఆచరించడానికి సులభమైనది. (9: 2)

**ఆత్మవిద్యను ఆచరించటానికి కులాలు, మతాలు, వర్ణాలు వంటి ఆంక్షలున్నాయా?**
ఆత్మవిద్యను అందరూ తెలుసుకోవచ్చు. మతాలకు, వర్ణాలకు ఆంక్షలు లేవు. ఆత్మతత్వాన్ని ఆచరించేవారు పాపులైనా... పుణ్యాత్ములైనా.. రాజులైనా... అందరూ ఒకే విధమైన నా పరమపదాన్నే పొందుతారు. (9:32,33)

**ఆత్మ విద్యతో మోహం నాశనం..**
ఉత్కృష్టమై, గుహ్యమై, అధ్యాత్మ సంజ్ఞ గల ఏ ఆత్మతత్వాన్ని మీరు చెప్పారో... వాటిని వినటం వల్ల నా మోహం అంతా నశించింది. (11 : 1)

**జ్ఞాన మార్గంతోనే పరమపదంలో మహర్షులు**
జ్ఞానములలోకెల్ల పరమోత్తమమైన జ్ఞానం. దీనిని ఆశ్రయించే మహర్షులందరూ పరమపదాన్ని అధిష్ఠించారు. (14:1)

**ఆత్మవిద్యను ఆచరించే...**
**ఆత్మ ప్రళయంలోనూ నశించదు...**
**జనన మరణాలుండదు..**
ఈ జ్ఞానాన్ని ఆశ్రయించి, నా సమతాస్థితి పొందిన వారు... ప్రళయ కాలంలోనూ నశించరు. సృష్టి సమయంలో మళ్లీ మళ్లీ జన్మించరు. జనన మరణ ప్రవాహంలో తగులుకోరు. (14 : 2)

**ఉత్తమ జ్ఞాని ఎలా వుంటాడు?**
సమస్తప్రాణుల సుఖ దు:ఖాలను తన సుఖ దు:ఖాలుగా తలచేవాడు ఉత్తమమైన జ్ఞాని. (6:32)

# ఆత్మను నీరు.. నిప్పు... గాలి... ఏమీ చేయలేవు...

ఆత్మ విద్య గొప్పతనం గురించి భగవద్గీతలో ఏం చెప్పారో ఇది వరకు అధ్యాయంలో చదివాం. ఇప్పుడు ఆత్మ విద్య అంటే ఏమి? ఆత్మ విద్యలో ఏం నేర్చుకుంటాం. భగవద్గీతలోని పలు అధ్యాయాల్లో ఆత్మ విద్య అంటే ఏమి తెలుసుకోవటం అని వుందో తెలుసుకుంటాం.

### ఆత్మ.. పరమాత్మలకు నాశనం లేదు..

వాతావరణంలో మార్పులైనా... ఇంద్రియాల వల్ల కలిగే సు:ఖ,దు:ఖాలైనా, అశాశ్వతమైన శరీరంపైన ప్రభావం చూపుతాయి తప్ప, ఆత్మను నాశనం చేయలేవు. అలాగే ఈ జగత్తును మొత్తం అగోచరంగా వ్యాపించి వున్న పరమాత్మకు నాశనము లేదు. నాశనం చేయశక్యం కాదు. (2:16,17)

### దేహాన్ని హింసిస్తే.. ఆత్మను హింసినట్టు కాదా?

దేహాన్ని హింసిస్తే ఆత్మను హింసినట్టు భావించినా.. దేహం మృతస్థితిలో వుంటే... ఆత్మ కూడా నాశనం అయిపోయిందని అనుకున్నా... అలాంటి వారు ఆత్మను గురించి తెలిసిన వారు కాదు. (2:18,19)

### ఆత్మను నాశనం చేయలేమా?

ఏ ఆయుదాలతోనూ ఆత్మను హింసించలేరు. చంపలేరు. ఆత్మ చంపబడదు. (2:18,19)

### మనిషిని చంపితే... ఆత్మ నశిస్తుందా? లేదా?

దేహం చంపబడినా, ఆత్మ ఎప్పుడూ చంపబడటం లేదు. (2:20,30)

ఆత్మను ఆయుధాలు నరకలేందు. నిప్పు కాల్చలేందు. నీరు తడపలేందు. గాలి ఎండిపోయేలా చేయలేదు. (2:23,24)

### దేహత్యాగం తరువాత ఆత్మ ఏమవుతుంది?

దేహం... ఆత్మకు ఓ వస్త్రం లాంటిది. ఆత్మ పాత దేహాన్ని వదిలి పెట్టిన తరువాత కొత్తదేహం పొందుతుంది.
అలా ఆత్మ కొత్త దేహంతో పుట్టిన తరువాత ... మళ్లీ ఆ దేహాన్ని వదిలుతుంది. మళ్లీ కొత్త మరో కొత్త దేహాన్ని పొందుతుంది. ఇలా దేహాలు మారుతూ జనన... మరణాలు పొందుతూనే వుంటుంది. మరణం అని భావించేది... ఆత్మ దేహాలను మారటాన్నే తప్ప, ఆత్మ నాశనం కావటం లేదు. ఆత్మకు శాశ్వత మరణం లేదు. అని తెలుసుకున్న వారు... మరణాన్ని గురించి దు:ఖించడు. (2:21,22, 26,27,28)

### ఆత్మ వుంది అని ఎలా నమ్మటం? మరణాన్ని తట్టుకోలేక గొప్ప వారు కూడా ఎందుకు దు:ఖిస్తున్నారు?

దేహాన్ని పొంది మళ్లీ పుట్టటానికి ముందు ఆత్మ అవ్యక్తంగా (కనిపించకుండా) వుంది. దేహాన్ని పొందిన తరువాత శరీరంతో పాటు కన్పిస్తుంటుంది. మళ్లీ దేహాన్ని వదిలేస్తే... మళ్లీ అవ్యక్తం. ఆత్మ అవ్యక్తం, అచింత్యం, అవికారి అని ఆత్మ గురించి తెలిసిన వారు.. ఆ విషయాలను చెపితే కొందరు ఆశ్చర్యపోతూ వింటారు. మరికొందరు వినినా అర్థం చేసుకోరు. అందువల్లే దు:ఖిస్తున్నారు. (2: 25,28,29)

### పరమాత్మపై ఆదారపడినది...

వాయువు ఎల్లయెడల సంచరించగలిగినా, ఎల్లప్పుడు ఆకాశం పరిధిలోనే ఉనికి కలిగివుంటుంది. అలాగే సమస్త జీవరాశులు నాలోనే ఉండి , నాపైనే ఆధారపడి వున్నాయి. (9:6)

### ఆత్మ మొదలు... తుది... దేహత్యాగం... పరమాత్మవల్లనే...

ఈ సమస్త భూతాలు నాలో లీనం అవుతున్నాయి. మరల వాటిని నేను సృష్టిస్తున్నాను. (9: 7)

జీవుల దేహత్యాగంలో (మరణ విషయంలో) ఎవరైనా నిమిత్తమాత్రులే... (11 : 33,34)

### పరమాత్ముని అంశమే ఆత్మ...

అనాది అయిన నా అంశమే ప్రపంచంలో జీవరూపంలో ఉంది. ప్రకృతికి సంబంధించిన జ్ఞానేంద్రియములు, మనస్సు అనే ఆరు కలిసి ఆ జీవుని విషయముల వైపు ఆకర్షిస్తున్నాయి. (15:7)

### జన్మ నుంచి జన్మకు... ఆత్మ దేన్ని తీసుకుపోతుంది?

ఒక జీవుడు ఒక శరీరాన్ని విడిచి మరొక శరీరాన్ని ప్రవేశించేటపుడు వాయువు పుష్పం నుండి పరిమళాన్ని తీసుకొని పోతున్నట్టు, మనస్సుతో కూడిన పంచేంద్రియాలను ఆకర్షించుకొని పోతూంటుంది.(15:8)

### జీవించి వున్నపుడు ఆత్మ... ఎలా తన కార్యక్రమాలను నిర్వర్తిస్తుంది?

ఈ జీవుడు చక్షుశ్రోత్రాది పంచ జ్ఞానేంద్రియాలను, మనస్సును, అధిష్ఠించి ఇంద్రియ విషయాలను అనుభవిస్తున్నాడు.(15:9)

## ఎవరి ఆత్మను... వారు చూడవచ్చా?

ఒక శరీరం నుండి మరొక శరీరానికి మారుతూ ఉండేవాడు. దేహంలోనే ఉండి శబ్దాది విషయాలను అనుభవించేవాడు, సుఖదుఃఖ మోహాది గుణాలు వుండేవాడు. అయిన జీవుడిని... అజ్ఞానులు చూడలేరు. జ్ఞానులు జ్ఞానదృష్టితో చూస్తున్నారు. (15:10)

## చిత్తశుద్ధితో ఆత్మను దర్శించే జ్ఞానదృష్టి...

ఆత్మ సాక్షాత్కారానికోసం ప్రయత్నించే యోగులు (ఉపాసకులు) తమలోనే ఆత్మదర్శనం పొందుతారు. చాలా మంది అలా ప్రయత్నించినా చిత్తశుద్ధి లేనివారు (అజ్ఞానులు) ఆత్మను చూడలేకున్నారు.(15:11)

## ఆత్మస్వరూపం ఎలా వుంటుంది?

ఇంద్రియాలను జయించి, మనస్సు సమాధానంగా వుండి, చలి - వేడి, సుఖం దుఃఖం, గౌరవం - అవమానం కలిగినా చలించకుండా వుండి, చిత్తం స్థిరంగా వుంటే... అదే వారి ఆత్మస్వరూపం. (6:7)

## యోగా రూడుడు ఎలా వుంటాడు?

ఆత్మగురించిన శాస్త్ర జ్ఞానం వల్ల, అనుభవ జ్ఞానం చేత, మనస్సు తృప్తిని పొంది... జ్ఞానం విజ్ఞానం ఇక చాలు అనే తలంపుకు ఇంద్రియాలను జయించి, మట్టి, రాయి, బంగారం వీటిని కూడా సమంగానే చూసే స్థితికి చేరుకున్న వారు... సమాధిస్థితిని పొందిన యోగారూడుడు అంటారు. (6:8)

## ఆత్మయోగంతో దు:ఖంపై విజయం

ఏ ఆత్మసాక్షాత్కారాన్ని పొందిన వాడు. ఆ తరువాత దానికంటె (ఆత్మను పొందటం కంటే) మేలైనది మరొకటి వుందని భావించడు. అలా ఆత్మధ్యానంలో స్థిరత్వం సాధించిన వాడు... ఎంతటి దు:ఖాన్ని కూడా లెక్కచేయడు. అలాంటి కదిలింపబడని స్థితినే ఆత్మయోగం అంటారు. (6:22).

# పాపవిముక్తికి... నిష్కామకర్మ ఉత్తమం

భగవద్గీత కర్మ (పని) గురించి నాలుగు అంశాలు చెపుతుంది.

1. జీవితంలో వివిధ పాత్రల్లో తాను చేయాల్సిన పనులను సక్రమంగా చేయకపోతే వచ్చే కష్టం, నష్టం తనకు తనను నమ్ముకున్న వారికి ఏమి జరుగుతుంది? ఎలా జరుగుతుందో మొదట ప్రతి వ్యక్తి తెలుసుకోవాలని స్పష్టంగా చెపుతుంది.
2. ఆత్మజ్ఞానంతో చేసే నిష్కామకర్మ ద్వారా గత జన్మపాపాలను పోగొట్టుకోవటానికి మార్గం చెపుతుంది.
3. ఈ జన్మంలో పాపాలు దరిచేర కుండా వుండటానికీ భగవద్గీత చూపించిన జీవన మార్గం నిష్కామ కర్మే.
4. నిష్కామ కర్మ అంటే సన్యాసం కాదు. మనిషి తన నుంచి తాను ఏమీ ఆశించకుండా.. తనకు తాను ఏ విధంగా మేలు చేసుకుంటాడో... అలాగే జీవులందరికీ ఏ విధంగా సేవ చేసినా... మనసులో ప్రయోజనాన్ని (ఫలితాన్ని) ఆశించి చేయక.. ఆత్మను ఓ ప్రేక్షకుడిలా చూసేస్థితిలో కర్మ చేయటాన్ని నిష్కామకర్మ అని భగవద్గీత నేర్పుతుంది.

భగవద్గీత ఎక్కడా సన్యాసాన్ని ప్రోత్సహించదు.
సన్యాసాన్ని వ్యతిరేకిస్తుంది. పరమాత్మకు దగ్గర కావటానికి నిష్కామకర్మను ప్రతిపాదిస్తుంది.
నిష్కామ కర్మ అంటే ఏమి? దాన్ని ఆచరించాలంటే ఏమి చేయాలి? ఎలా జీవించాలి? శరీరం చేసే పనులకు ఆత్మకు సంబంధం లేకుండా ఎలా సాధ్యం? అప్పుడు ఆత్మ ఏస్థితిలో వుండాలి? అలా నిష్కామకర్మ చేయటం వల్ల ఏమి మేలు జరుగుతుంది? ఇలా నిష్కామ కర్మ గురించి భగవద్గీతలోని వివిధ అధ్యాయాల్లో వివరించిన అనేక అనేక అంశాలను... వాటి శ్లోకాల సంఖ్యతో ఇచ్చాం. నిష్కామకర్మ గురించి సంపూర్ణంగా ఒకే చోట తెలుసుకుందాం.

## పాపాన్ని దూరం చేసుకునేందుకు... యజ్ఞాలు చేయటం, బలులు ఇవ్వటం లాంటి క్రియలు నిర్వర్తించే వారికి ఎలాంటి ఫలితం వుంటుంది?

చూసేందుకు మాత్రమే రమ్యంగా వుండే అలాంటి క్రియలను అవివేకులు మాత్రమే... గొప్పవిగా పొగుడుకుంటూ ఆచరిస్తుంటారు. భోగాలు, ఐశ్వర్యం తదితర ఈ లోకంలోని కోరికలతోనూ, స్వర్గంపైన అనురక్తి వున్న మనస్సుతోనూ అలాంటివి చేస్తున్నారు. అవ్వన్నీ మళ్లీ మళ్లీ జన్మించే ఫలాన్నే ఇస్తాయి. అలాంటివి ఆచరించే వారి మనస్సు భగవంతుడిపట్ల స్థిరం కావటం లేదు. (2:42,43,44)

## నేను ఈ రెండింటిలో ఏ మార్గాన్ని ఎంచుకోవాలి?

యజ్ఞం, బలులు వంటి క్రియలు త్రిగుణాలనూ (సత్వ, రజస్సు, తమస్సు), కోరికలనూ పెంచుతాయి. ఇది అధమం. నువ్వు సత్వగుణంతో... ద్వందాలకు అతీతంగా (జయం అపజయం, లాభం, నష్టం. సుఖం, దు:ఖం) నిష్కామ కర్మ చేస్తూ భగవంతుడిపైన స్థిరమైన ఆత్మనిష్ఠుడవుగా వుండు.(2:45,49)

## నిష్కామ కర్మమార్గం... యజ్ఞం... బలులు ఇచ్చే మార్గం కంటే ఎలా గొప్పది?

నిర్మలంగా ప్రవహించే మంచినీటి నదీ ప్రవాహానికీ... దాని పక్కనే వుండే చిన్న బావికీ ఎంత తేడా వుంటుందో అంత తేడా వుంటుంది. ఆత్మనంద ప్రవాహం ముందు.... బావుల్లాంటివి యజ్ఞ బలులు, క్రియలు. (2:46)

## నిష్కామకర్మ అంటే ఏమి?

## నిష్కామయోగం అంటే... ఏ పని చేయకుండా వుండటమా?

## కర్మతో నాకు ఎలాంటి అనుబంధం వుండాలి?

నిష్కామకర్మ అంటే ఏ పని చేయకుండా వుండటం కాదు. ఏ పని చేయకుండా వుందామనే ఆలోచన కూడా మంచిది కాదు. కర్మ (పని) చేయాలి. కర్మ చేయటానికి నీకు అధికారం (పరమాత్మ నుంచి అనుమతి) వుంది. పని వల్ల వచ్చే ఫలితంపైన నీకు అధికారం లేదు. (అది నీ చేతుల్లో వుండదు). కాబట్టి... కర్మ చేయాలి. కర్మ వల్ల వచ్చే ఫలతంపైన ఆసక్తి వుండకూడదు. కర్మఫలం ఎలా వున్నా... స్వీకరించటానికి సిద్ధంగా వుండటాన్నే నిష్కామయోగం అంటారు. కర్మ ఫలితంపై ద్వందాలతో వుండకూడదు. (2:47,48,50)

## నిష్కామకర్మ కంటే సన్యాసం మేలు కదా? ఏ పని చేయకుండా జీవిస్తే మోక్షం సాధ్యమా?

ఎవ్వరైనా... ఎన్నడూ క్షణ కాలం కూడా కర్మ చేయకుండా వుండటం లేదు.
ప్రకృతి కారణంగా... సత్వ, రజ:, తమో గుణాలు జీవులను వివశులను చేసి, వారిని ఏదో కర్మకు బాధ్యులను చేస్తోంది. కాబట్టి ఏ జీవికీ.. కర్మలేని స్థితి వుండదు. **కర్మపరిత్యాగం (కర్మను వదిలి పెట్టడం) వల్ల మోక్షం పొందడు.** (3 : 4,5)

## కర్మ సన్యాసము(సన్యాసం), కర్మయోగము (నిష్కామకర్మ) ఈ రెండింటిలో ఏది శ్రేయస్కరమైనది? (5:1)

కర్మసన్యాసము(సన్యాసం) , కర్మయోగము (నిష్కామకర్మ). ఈ రెండును వేరు వేరు కాదు. రెండూ శ్రేయస్కరములైనవే. ఈ రెండూ సమఫలాన్నే ఇచ్చేవని ఎవరు తెలుసుకొంటాడో వాడే

నిజమైన జ్ఞాని. ఈ రెండింటిలోనూ కర్మ సన్యాసం కంటే కర్మయోగమే(నిష్కామకర్మ) శ్రేష్ఠమైనది. (5:2,4,5).

## సన్యాసం తీసుకోకుండా.. కూడా కర్మచేయవచ్చా? ఎలా జీవిస్తే నిష్కామకర్మయోగి ముక్తి పొందగలడు?

1. దేనినీ ద్వేషించకుండా..
2. దేనినీ కోరకుండ..
3. సుఖ దు:ఖాది ద్వంద్వాలను అతీతంగా..
4. చిత్తశుదితో..
5. దేహం. ఇంద్రియాలు, మనస్సు, బుద్ధిలను స్వాధీనం చేసుకుని...
6. సమస్త జీవుల్లో వుండే ఆత్మ తాను గాను , తాను సమస్త భూతములయందుండు ఆత్మగాను ఎవరు తెలుసుకుంటాడో అలాంటి వ్యక్తి... సన్యాసం తీసుకోకుండా కర్మచేసినా... అతనే నిష్కామ కర్మయోగి. ఇలాంటి వారు కర్మ ఆచరించినా కర్మబంధము నుండి ప్రయాస లేకుండా కైవల్యం పొందుతారు. (5:3,5,7)

## ముక్తికోసం ఇలా నిష్కామకర్మను ఆచరించవచ్చా?

ముక్తి మోహంతో కర్మలను త్యజించడం తామస త్యాగం అవుతుంది. (18:7)

## శరీరాన్ని కష్టపెట్టకుండా... బద్ధకంతో పని చేయకుండా వుండటం కూడా నిష్కామకర్మ అవుతుందా?

శరీరానికి కష్టం కలుగుతుందని భయంతోనో, ఓ పని చేస్తే దు:ఖం కలుగుతుందనో ఎవరైనా కర్మను చేయటం మానేస్తే... ఆ త్యాగం రాజస త్యాగం అవుతుంది. అటువంటి రాజస త్యాగం వలన అతనికి ఎటువంటి ఫలమూ కలగదు. (18:8)

## పనిలో కూడా ఉత్తమమైంది... అధమమైంది అని వుంటుందా? దేశంకోసం యుద్ధం చేయటం... విధి నిర్వహణలో తప్పనిసరిగా చేయాల్సినవి చేస్తే పాపమా? సాత్వికంగా మాట్లాడాలంటారు. దుర్మార్గున్ని కఠినంగా ప్రశ్నించాల్సి వస్తే తప్పా?

చక్కగా ఆచరింపబడిన ఇతరుల కర్మ కంటె సదోషంగా ఆచరింపబడిన స్వకర్మ శ్రేయస్కరం. స్వభావ నియతకర్మ చేసేవాడు... పాపం పొందడు. (18:47)

జన్మసిద్ధమైన కర్మ దోషయుక్తంగా వున్నా... త్యజించాల్సిన పని లేదు. ఎందుకంటే... ప్రతి కర్మ అగ్ని పొగచేత కప్పబడినట్లు - ఏదో ఒక దోషంతో కప్పబడి వుంటుంది.(18:48)

ఏ వృత్తి నిర్వహిస్తున్నా... దేనిపైనా ఆసక్తి లేని బుద్ధితో, ఆత్మ నిగ్రహంతో, వాంఛలు లేకుండా కర్మ చేసే వాడు... సన్యాసం వల్ల ఎలాంటి కర్మాతీతమైన దశారూప సంసిద్ధి పొందుతాడో... అలాటి స్థితినే పొందుతాడు. (18:49)

## నిష్కామకర్మ చేసే వారి బుద్ధి ఎలా వుండాలి? ఎలా వుంటుంది? ఎలాంటి బుద్ధితో కర్మలు చేస్తే కర్మబంధం నుంచి విముక్తి కావచ్చు? (2:39)

నిష్కామ కర్మయోగాన్ని ఏ కొంత ఆచరించినా జన్మ మృత్యు రూపంలో వున్న చివరి భయం నుంచి రక్షణ వుంటుంది. (2:40)

అనేక కోరికలతో చంచల బుద్ధితో వుండేవారి ఆధ్యాత్మిక ప్రయాణం దారి తెన్నూ లేకుండా వుంటుంది. కర్మయోగాన్ని ఆచరించేవారి బుద్ధి ఏక నిష్ఠతో వుంటుంది. (2:41)

## నిష్కామయోగి ఆదర్శప్రాయంగా నడుచుకోవాలి...

జ్ఞాని తన చర్యల ద్వారా అజ్ఞానుల బుద్ధిని చలింపజేసి కర్మలలో అశ్రద్ధ కలిగేలా తప్పుదోవ పట్టించకూడదు. తాను అప్రమత్తంగా వుంటూ మాటలతో కాకుండా... చేతలలో లోకోపకార కర్మలను శ్రద్ధతో ఆచరించాలి. అలా ఇతరులకు మార్గదర్శిగా నడుచుకోవాలి. (3:26)

పరతత్త్వజ్ఞానముతో వుండాలి. కర్మలకు కర్తను "నేను" అనే అహంకారాన్ని ప్రదర్శించ కూడదు. (3:27)

గుణకర్మ విభాగాలు ఆత్మకు కావు అని తెలుసుకోవాలి. (3:28)

## జ్ఞాని కర్మలను ఎలా ఆచరించాలి?

1. ఫలాపేక్షను త్యజించాలి ,
2. ఎటువంటి స్వార్థభావం వుండకూడదు.
3. నిత్య తృప్తుడై వుండాలి.(అసంతృప్తితో వుండకూడదు)
4. కర్మఫలంపై పరమాత్మకు ఎలా ఆసక్తి వుండదో, అదే విధంగా కర్మఫల ఆసక్తి లేకుండానే కర్మలను చేయాలి.
5. త్యాగబుద్ధితో, దయతో...

ఒక జ్ఞాని సంఘంలో కర్మలను ఆచరించినా... అతడు కర్మలు చేయనివాడే అవుతున్నాడు. అతని కర్మలన్నీ జ్ఞానాగ్నిచే దగ్ధం కావడంవల్ల అతడాచరించే కర్మలు ఆకర్మలే అవుతున్నాయి. (4:15, 19,20,23)

## ఫలితాలను సమదృష్టితో చూసే స్థితి ఎప్పుడు వస్తుంది?

నీ బుద్ధి మోహకాలుష్యాన్ని అతిక్రమించినపుడు. (2-52)

ఏ పని చేయటం వల్ల కలిగే ప్రయోజనాన్ని ఆపేక్ష, ఆసక్తి వదలి ఆచరించడమే ఉత్తమ విధానం. (18:6)

## నిష్కామ కర్మయోగి.. తన ఇంద్రియాలతో ఎలాంటి అనుబంధంతో వుంటాడు?

కంటితో చూస్తున్నా...
కళ్లను మూస్తున్నా...
చెవితో వింటున్నా..
చర్మంతో తాకుతున్నా..

ముక్కుతో వాసన చూస్తున్నా..
నోటితో తింటున్నా...
మనస్సుతో ధ్యానిస్తున్నా...
బుద్ధితో తత్వ చింతన చేస్తున్నా...

నడుస్తున్నా..
నిద్రిస్తున్నా..
శ్వాస వదులుతున్నా..
మాట్లాడుతున్నా...

ఏ పనులను తాను చేసినట్టు కాకుండా.. ఇంద్రియాలు, బుద్ధి, మనస్సు వేటి పని అవి చేస్తున్నాయనే విధంగా ప్రవర్తిస్తుంటాడు. ఒక్క పని కూడా తాను చేయటం లేదని భావిస్తాడు. (5:8,9,11)

## ఇవే పనులు చేసే ఇతరులకు కర్మబంధం వుంటే? నిష్కామకర్మయోగికి... ఎందుకు పాపాలు అంటవు?

తన ఇంద్రియాల చేత చేయబడుతున్న కర్మల నుంచి తాను ఎలాంటి ఫలితాన్ని ఆశించకుండా... పరమాత్మకు అర్పించటం వల్ల నీరు తామరాకును అంటని విధంగా నిష్కామకర్మయోగికి పుణ్యపాపాలు అంటవు. (5:10)

సకామకర్ములైన మిగిలిన వారిలో తాము చేసే కర్మపై ఫలాసక్తి వుంటుంది. అందువల్ల వారు సంసారంలో బద్ధులవుతున్నారు. (5:12)

నిష్కామ కర్మతో చిత్తశుద్ధి పొందిన తరువాతే కర్మసన్యాసం పొందాలి.(5:6)

## నిష్కామకర్మయోగిలోని ఆత్మ ఏం చేస్తున్నట్టు?

నవద్వారాల దేహనగరంలో తానేమీ చేయకుండా... మనస్సు, బుద్ధి, ఇంద్రియాల చేత ఏ పని చేయించకుండా.. అవి చేస్తున్న కర్మలను ప్రేక్షకుడిలా చూస్తూ... నిర్లిప్తుడై వుంటాడు.(5:13)

## నిష్కామయోగ ఆచరణ వల్ల ఏమవుతుంది?

నిష్కామకర్మ యోగులు కర్మల ఫలాలను త్యజించటం వల్ల జన్మ మరణం అనే దేహబంధం నుంచి విడివడి ముక్తులవుతారు. (2: 51)

## నిష్కామకర్మ ఎందుకు పాపం కాదు?

పోరాటం వల్ల వచ్చే జయం అపజయం, దాని వల్ల కలగబోయే లాభం, నష్టం... తద్వారా కలిగే సుఖం, దు:ఖాలను సమంగా భావించాలనే దృక్పథంతో పోరాటానికి ముందే సిద్ధపడితే పాపం కాదు.(2:38)

## మామూలుగా కర్మలు చేసే వారికి... కర్మ ఫలత్యాగంతో జీవించే వారికి ఆధ్యాత్మికంగా పొందే ఉన్నతిలో ఏమైనా తేడా వుందా?

కర్మఫలం మామూలుగా మూడు రకాలు.
1. ఇష్టమైనది పొందటం
2. అనిష్టమైంది పొందటం
3. ఇష్టం... అయిష్టమూ రెండూ వుండేవి.
ఆయా కర్మలను బట్టి కర్మల నుంచి ఈ ఫలితాలను పొందేవారు.. మరణం తరువాత పరమపదం, నరకం, మానవజన్మ... అనే ఫలాలను ఆయా కర్మలను బట్టి పొందుతారు.

ఈ మూడు రకాలైన కర్మల్లోనూ కర్మ ఫలాలను త్యజించిన వారు.. మరణం తరువాత నరకం... మానవ జన్మ అనే కర్మఫలాలు కలగవు. (18:12)

## కర్మకు తానే కారణం అనుకోవటం తగునా?

సాంఖ్యశాస్త్రం కర్మ ఈ అయిదింటిని కారణాంశాలుగా చెపుతోంది... (18:14)
1. అధిష్టానము (శరీరము)
2. కర్త (అహంకారము),
3. జ్ఞానేంద్రియాలు,
4. కర్మేంద్రియాల వివిధ వ్యవహారాలు,
5. అధిష్టాన దైవము.

## ఈ అయిదూ మనిషి చేసే కర్మలో ఎలా భాగస్వామ్యం అవుతోందంటే..

మాట్లాడటాన్ని ఉధాహరణగా తీసుకుందాం. మాట్లాడినా, మరి ఏ ఇతర పని చేసినా... మనస్సుతో మానవుడు ఎటువంటి కర్మను ప్రారంభించినా అది న్యాయమైనది కాని అన్యాయమైనది కాని, దానికి పైన పేర్కొన్న ఈ అయిదూ కారణం అవుతున్నాయి. (18:15)

## ప్రతి కర్మలోనూ ఈ అయిదు కారణం అయితే... “నేను” చేస్తున్నాను అనుకోవచ్చా?

కర్మకు తన ఆత్మ కారణంగా ఎవరు భావించినా.. అతడు వాస్తవాన్ని గ్రహించటం లేదనే అర్థం. (18:16)

## అహం కర్త అనే భావం లేక పోతే ఏమవుతుంది?

ఎవరి బుద్ధి, మంచి చెడు వాసనలు అంటి లేవో... ఎవరికి అహం కర్త అనే భావం లేదో అటువంటి వాడు ఈ లోకంలో ఏ కర్మ

చేసినా.. అతను చేసే కర్మకు అతను బద్దుడు కాడు. (18:17)

**కర్మ... కర్త... బుద్ధి... ధృతి... సుఖం... మూడు రకాలు...**
కర్మకు నిష్కామయోగి "నేను" అనే భావనను వదులుకోవటమే కాకుండా... సాత్వికగుణంతో వుంటే పరిపూర్ణ నిష్కామకర్మయోగం అవుతాడు. సాత్వికం.. రాజసం... తామసం అని మూడు రకాలుగా వారి... కర్మ... కర్త.. బుద్ధి.. ధృతి.. సుఖం కూడా వుంటాయని... అందులో సాత్వికం ఉత్తమని వ్యాసుల వారు చెపుతున్నారు.

**సాత్త్విక కర్మ... కర్త... బుద్ధి... ధృతి... సుఖం...ఎలా వుంటాయి?**
**సాత్వికకర్మ:** శాస్త్ర విహితం, ఫలాపేక్ష లేనిది, నిస్సంగం, రాగద్వేష రహితంగా చేయబడే కర్మలు సాత్త్విక కర్మ. (18:23)
**సాత్వికకర్త :** ఆసక్తి కర్తృత్వ భావములేక, అహంకారము లేనివాడై ధైర్యము ఉత్సాహము కలిగి జయాపజయాల వల్ల వికారాలు పొందని వాడిని సాత్త్విక కర్త అంటారు. (18:26)

**సాత్విక బుద్ధి:** కర్మ - నిష్కామ మార్గములను ; కర్తవ్యాలు - అకర్తవ్యాలు, భయం - అభయం, బంధం- మోక్షం వాటి కారణాలను తెలుసుకున్న బుద్ధిని సాత్త్విక బుద్ధి అంటారు. (18:30)

**సాత్విక ధృతి:** మనస్సు, ప్రాణము, ఇంద్రియాలకు సబంధించిన క్రియలను క్రమముగా నిర్వహిస్తూ యోగము చేత సుస్థిరతచెందిన "ధృతి" పొందటం సాత్త్వికము. (18:33)

**సాత్విక సుఖం:** మొదట విష ప్రాయంగా వుంది, చివరకు అమృత ప్రాయమైందో... ఆ సుఖం సాత్వికం. ఆత్మానుభూతితో కలిగే ప్రసన్న బుద్ధిత్వం వల్లే అది కలుగుతుంది. (18:37)

**రాజస కర్మ... కర్త... బుద్ధి... ధృతి... సుఖం...ఎలా వుంటాయి?**
**రాజస కర్మ :** కోరికలతో, అహంకారముతో చేసే కర్మ రాజసకర్మ (18:24)

**రాజస కర్త :** మోహావేశుడు, కర్మఫలాపేక్ష కలవాడు, లుబ్ధుడు, హింసించే బుద్ధిగలవాడు, శౌచం లేనివాడు, హర్షశోకాలతో కూడినవాడు అయిన కర్త రాజసకర్త అవుతాడు. (18:27)

**రాజస బుద్ధి :** ధర్మాధర్మములను, కార్యాకార్యాలను తప్పు విధంగా గ్రహించే బుద్ధి రాజసికము. (18:31)

**రాజస ధృతి :** ధర్మార్థకామాల వైపుకు బుద్ధిని మరల్చి, అందు ప్రతిదాని ఫలాన్ని పరిపూర్ణా స్థితితో అభిలషింపజేసే "ధృతి" రాజసికము. (18:34)

**రాజస సుఖం :** విషయాలతో ఇంద్రియాలు కలవటం వల్ల కలిగేది. ఈ సుఖం ప్రారంభంలో అమృతప్రాయముగా వున్నా... చివరకు విష ప్రాయమౌతుంది. అలాంటి సుఖాన్ని రాజసికము అంటారు. (18:38)

**తామసిక కర్మ... కర్త... బుద్ధి... ధృతి... సుఖం... ఎలా వుంటాయి?**
**తామసిక కర్మ :** రాబోయే ఫలితాలను గానీ, కలగబోయే కష్ట నష్టాలనుగానీ, తన శక్తి సామర్థ్యాలనుగానీ ఆలోచించకుండా... మోహంతో చేసే కర్మలను తామసకర్మ అంటారు. (18:25)

**తామసిక కర్త :** మనోనిగ్రహము లేనివాడు, పామరుడు, సంస్కారము లేనివాడు, ధూర్తుడు, ద్వేషి, సోమరి, కాలయాపన చేసేవాడు - ఈ గుణాలతో వుంటాడు. అలాంటివాడు తామసకర్త. (18:28)

**తామసిక బుద్ధి :** తమోగుణముచే కప్పబడి, అధర్మం ధర్మంగా, సర్వ విషయాలనూ వ్యత్యాసంగా గ్రహించే బుద్ధిని తామసబుద్ధి అంటారు.(18:32)

**తామసిక ధృతి :** నిద్రను, భయాన్ని, సంతాపాన్ని, వ్యాకులతను, మధాన్ని, బుద్ధిహీనుడైన వాడు పరిత్యజించ కుండా చేసే "ధృతి" తామసికము. (18:35)

**తామసిక సుఖం :** నిద్ర, మాంద్యం, పొరపాటు : వీటితో కలిగి, ఆత్మ మూఢతతో ప్రారంభమై, దాంతోనే అంతమయ్యే సుఖం తామసికము. (18:39)

**నిష్కామకర్మకు కొలబద్ద ఏమి?**
శ్రేష్ఠులైన వ్యక్తులు ఆచరణననే జనసామాన్యం అనుసరిస్తారు. అతడు ఆచరించేది లోకానికి ప్రమాణం. సాధారణ జనులు కూడా దానినే పాటిస్తారు. (3:21)

**ఎవరు ఉత్తమ నిష్కామకర్మయోగి అని గుర్తించి... వారిని అనుసరించటం?**
అజ్ఞాని కర్మను ఫలాసక్తితో నిర్వర్తిసుంటారు. ఆత్మజ్ఞాని, లోకోపకారిగా ఇతరులకు మార్గదర్శిగా వుండే విధంగా... భగవంతుని సంతుష్ట పరిచేలా కర్మలను ఆచరించాలి. (3:25)

**ఉత్తములను అనుసరించాలని చెపుతున్నారు. అయితే చెడ్డవారిని చూసి ప్రేరేపితులై... పాప కార్యాలు చేస్తున్నారు. ఎందుకు?(3:36)**
పొగచేత అగ్ని, మురికిచేత అద్దము, గర్భాశయము (మావి)చేత గర్భమునసున్న శిశువు ఎలా కప్పబడివున్నదో అలాగే... కోరికలతో ప్రేరేపించబడిన వారి జ్ఞానము కప్పబడియున్నది. రజోగుణం వున్న ఇలాంటి ప్రాణులు... తృప్తి లేక కోరికలతో ప్రేరేపించబడి ఇలా మహాపాపాలను చేస్తున్నాయి. (3:37,38,39)

## పరమాత్మా! కర్మ చేయటంలో మిమ్మల్నే అనుసరించవచ్చా?

సకల లోకాలలో నాకు ఏ కర్తవ్యం లేదు. ఇప్పుడు నేను పొందనిది ఇక పొందవలసినది ఏదీ లేదు. అయినా... విహితకర్మలు చేయటంలో లోకానికి ఆదర్శాన్ని నెలకొల్పేందుకు సర్వదా కర్మల్లోనే ప్రవర్తిల్లుచున్నాను. (3:22)

ఏకాలములోనూ అలసట లేకుండా... నేను కర్మలను ఆచరిస్తూ వుండకపోతే... మనుష్యులు (అన్ని విధాల ప్రాణులకు హితమైన) నా మార్గమును (నేనెట్లు నడచుచున్నానో ఆ విధమును) అనుసరిస్తారు. (3:23)

నీవు సర్వకర్మల ఫలాలను నాకు (పరమాత్మకు) కర్పించి, మనస్సును నా యందు (పరమాత్మ యందు) లగ్నం చేసి....ఫలాపేక్ష లేకుండా...'ఇది నాది' అనే ఆశను, మమకారాన్ని వీడి కర్మ చేయి. (3:30)

## ముక్తికోసం ఇలా నిష్కామకర్మను ఆచరించవచ్చా?

ముక్తి మోహంతో కర్మలను త్యజించడం తామస త్యాగం అవుతుంది. (18:7)

## సకామ, నిష్కామ కర్మయోగుల కర్మలకు దేవుడికి ఎలాంటి సంబంధం వుంటుంది?

అంతటనిండిన పరమాత్మ కర్తృత్వాన్ని కల్పించలేదు. కర్మలనుసృజించలేదు. ఇంక కర్మఫలములసంబంధమును కూడ కలిగించుటలేదు. ఒకని పాపమునుగాని పుణ్యమునుగాని తీసికోవటం లేదు. జ్ఞానము అజ్ఞానముచేత కప్పబడివుంది. అందువల్ల ప్రాణులు మోహమును పొందుతున్నాయి. (5:14,15)

మూఢత్వముచే నీవు చేయనిచ్చగింపనిదానిని, నీ స్వభావజనిత కర్మము (సంస్కారముల) వలన బద్ధుడవై, తప్పించుకోజాలక, ఇష్టము లేకున్నను చేయుదువు. (18: 60)

ఈశ్వరుడు సర్వభూత హృదయములందు నెలకొని వానిని తన మాయవలన - యంత్రముపై నిలుపబడినవానిని బోలె - తిరుగుచుండున ట్లొనర్చును. (18:61)
పరిపూర్ణహృదయముతో అతని నాశ్రయింపుము. అతని కృపచే నీవు పరమశాంతిని, శాశ్వత స్థానమును ప్రాపింతువు. (18:62)

గోప్యమైనవానియన్నిటికన్న గోప్యతరమగు జ్ఞానమును నీకు బోధించితిని. దానిని నీవు సంపూర్ణముగా విమర్శించి, నీ యిష్టానుసారము చేయుము. (18:63)

సర్వధర్మములను (అధర్మసహితముగా) విడనాడి, (ఆత్మరూపమున ఎల్లరలోనుండు) న న్నొక్కనినే ఆశ్రయింపుము. నేను నిన్ను అన్ని పాపముల నుండి విముక్తుని చేయుదును. శోకింపవలదు. (18:66)

మా యీ ధర్మసంవాదము భక్తితో పఠించువాడు నన్ను జ్ఞాన యజ్ఞరూపముగా పూజించినవా డగును. ఇది నా నిశ్చయము. (18:70)

## నిష్కామకర్మతో మోక్ష సిద్ధి

ప్రతి విషయంలో ఆసక్తి వదలి, మనోనిగ్రహంతో భోగవాసనలను వదిలి, ఆశ లేకుండా... కర్తృత్వభోక్తృత్వ అభిమానాలను వదిలి పెట్టి.. చేయాల్సిన బాధ్యతలను నిర్వర్తించటం వల్ల నైష్కర్మ్య సిద్ధి సాధ్యం. (18:49.)

## ప్రతిదీ పరమాత్మకు అర్పించటం

ఏపనిచేసినా, దేనిని తింటున్నా, దేనిని హోమం చేసినా, దేనిని దానం చేసినా, ఎటువంటి తపస్సు చేసినా దానినంతా పరమాత్మనైన నాకే సమర్పించటం. (9: 27)

.

## భగవదర్పిత మనస్సుతో కర్మలను ఆచరించడంవల్ల కలిగే ప్రయోజనం ఏమి?

ఇలా శుభాశుభ ఫలాన్నిచ్చే కర్మబంధం నుండి విముక్తుడవై సన్యాసయోగం ద్వారా ధృఢ మనస్సు పొంది, ముక్తుడవై నన్ను చేరుతావు (9: 28)

### నీరు, నిప్పు, గాలి ఏమీ చేయలేని ఆత్మను....

# గుణాలు నాశనం చేస్తాయా? గుణాలు ఆత్మను నాశనం చేసేంత శక్తివంతమైనవా?

ఆత్మను నీరు, నిప్పు, గాలి, భూమి, ఆకాశం ఇవి ఏవీ ఏమీ చేయలేవు అని పదే పదే చెప్పిన పరమాత్మ...
ఆత్మను ఏదీ నాశనం చేస్తుందో చాలా స్పష్టంగా చెప్పారు. అదే గుణాలు.
అంటే ప్రత్యక్షంగా నీరు, నిప్పు, గాలి, భూమి, ఆకాశం వంటి వాటి కంటే ప్రకృతి వల్ల కలిగే గుణాలు ఎంత ప్రమాదకరమైందో భగవద్గీత చాలా స్పష్టంగా చెపుతుంది. ముఖ్యంగా...

ఆత్మలో గుణాలు మనసు ద్వారా ఒక జన్మ నుంచి మరో జన్మకు ప్రయాణం అవుతుంది. ఈ జన్మలోకి రావటమే కాదు... దేహత్యాగం తరువాత ఆత్మతో కూడా వచ్చేది కూడా గుణాలే. అందుకే గుణాలకు తాత్వికమతం అంత ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చింది.

గుణాలకు వున్న ప్రాముఖ్యతను తెలియజేయటమే కాదు. గుణాలను నవరించుకోవటం ఎలా... దేహత్యాగం సమయంలో గుణాలు, ఆత్మతో పాటు రాకుండా ఏం చేయాలో కూడా నేర్పేదే... భగవద్గీత.

ఏ గుణం వుంటే మనిషిని ఏమని చెపుతారు? మనిషికి వుండాల్సిన గుణాలు ఏవి? ఆత్మకు మనసుకు గుణాలకు వున్న సంబంధాల గురించి భగవద్గీతలోని ఏఏ శ్లోకాల్లో ఏమి వుందో... వాటిని ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

### నిప్పు, నీరు, గాలి కూడా ఏమీ చేయలేని ఆత్మను... గుణాలు ఏం చేస్తాయి?

నాశనం లేని ఆత్మను... ప్రకృతి కారణంగా ఏర్పడే సత్వ, రజస్సు, తమో గుణాలు మూడూ కూడా దేహంలో బందిస్తాయి. (14:5)

### మంచిదైన సత్వగుణం కూడా ఆత్మను బంధిస్తుందా?

సత్వగుణము స్వచ్ఛమైంది. కాంతిమంతం. దోషరహితం. అయితే అది కూడా ఆత్మను జ్ఞాన ఆసక్తి చేత, సుఖాసక్తి చేత బంధిస్తోంది. (14:6,9)

### సత్వగుణం కాంతిమంతం అని అన్నారు? ఒక గుణం ఎలా కాంతివంతం అవుతుంది?

జ్ఞానం వల్ల తేజస్సును వృద్ధి చెందుతుంది. దేహంలోని ప్రతిద్వారం నుండి కాంతిపుంజం వెలువడినపుడు సత్వగుణలోని విశిష్టత తెలిసివస్తుంది. (14:11,17)

### రజోగుణం ఆత్మను "కర్మాచరణలో" ఎలా బంధిస్తుంది?

రజోగుణానికి... రాగం... అనురాగం అనేవి ముఖ్య లక్షణాలు. ఆ రజో గుణం నుంచే ఆశ, ఆసక్తి, మమకారం పుడుతుంటాయి. రజోగుణ ప్రకోపించినపుడు లోభం, అశాంతి, భోగలాలసత్వం తదితర లక్షణాలు ఉత్పన్నమవుతాయి. అందువల్ల ఈ రజోగుణం ఆత్మను కర్మాచరణలో ఆసక్తి కల్గించి... కర్మ ప్రవృత్తిలో ఆసక్తి కలిగేలా బంధిస్తోంది. (14:7,9,12,17)

### తమోగుణం నిద్ర, సోమరితనం, పరాకుతో ఆత్మను బంధిస్తోంది....

తమోగుణం అజ్ఞానం నుంచి వస్తుంది. ఈ తమో గుణం ప్రతి ఆత్మనూ భ్రమింపజేస్తుంది. తమోగుణం "నిద్ర, సోమరితనం, పరాకు" వంటివాటితో ఆత్మను బంధిస్తోంది. (14:8)

తమోగుణము తత్వజ్ఞానాన్ని మరుగుపరచి పరాకును, పొరపాటు కలిస్తోంది(14:9)

తమోగుణ విజృంభణ వల్ల కళాకాంతులు లేకపోవటం, పనిపాటలు చేయుటకు ఇచ్ఛ లేక పోవటం, పరాకు, భ్రమ మొదలైన దుర్గుణాలు కలుగుతున్నాయి. (14:13)

తమోగుణము వలన అజ్ఞానము భ్రమ పరాకులు పుడుతాయి. (14 : 17)

### ఈ మూడింటిలో ఏదో ఒక గుణంతో మనిషి వుంటాడా? ఏ గుణంలో వున్నపుడు ఏం జరుగుతుంది?

సత్వగుణము వృద్ధి చెందితే... రజస్సు, తమో గుణాల ప్రమాణం తగ్గుతాయి.

అలాగే రజోగుణం ప్రకోపిస్తే... సత్వ తమో గుణాలు,

తమోగుణము ప్రకోపిస్తే సత్వ, రజస్సులు అల్ప ప్రమాణంలో వుంటాయి.(14:10)

### ఏ గుణంతో చేసే కర్మలు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయి?

సాత్వికమైన పుణ్యకర్త చేసే కర్మ ఫలితము నిర్మలము అనీ,

రజోగుణతో చేసే కర్మఫలితం దుఃఖం అనీ,
తామస వ్యాపారాల ఫలం అజ్ఞానం. (14 : 16)

**ఈ మూడు గుణాల వారు ఎవరిని పూజిస్తారు.. శ్రద్ధను బట్టి స్వాభవం తెలుసుకోవచ్చా? గుణాలను బట్టి కూడా ఆధ్యాత్మిక జీవితం వుంటుందా?**

భగవంతుని పట్ల మానవుని శ్రద్ధను బట్టి వాని స్వభావాన్ని తెలుసుకోవచ్చు. మనిషి శ్రద్ధా స్వరూపుడు. ఎవరి శ్రద్ధ ఎలాంటిదో వాడు అలాంటివాడు అవుతున్నాడు. (17:3)

ఒక వ్యక్తి శ్రద్ధ సాత్త్విక రాజస తామసములలో ఎలాంటిదో అతని దైనందిన జీవితంలోని ఆచార వ్యవహారముల బట్టి తెలుసుకోవచ్చు (17 : 4)

సాత్త్విక శ్రద్ధగలవారు దేవతలను ఆరాధిస్తారు.
రాజసులు యక్ష రాక్షసులను ఆరాధిస్తారు.
తామసులు భూతప్రేతాలను ఆరాధింతురు.
కాబట్టి ఒక వ్యక్తి ఎవరిని ఆరాధిస్తాడో దాన్ని బట్టి అతని శ్రద్ధ ఎలాంటిదో తెలుసుకోవచ్చు. (17:4)

**తపస్సుపైన కూడా గుణాల ప్రభావం వుంటుందా?**

**సాత్త్విక తపస్సు :**

ఉత్తమమైన శ్రద్ధతో మనుషులు ఆచరించే తపస్సు మూడు రకాలు. నియమ బద్ధులై ఫలితంపై ఆశలేకుండా చేసే తపస్సు... సాత్త్విక తపస్సు. (17:17)

**రాజస తపస్సు :**

ఇతరుల నుండి బహుమతులను గౌరవాన్నీ పొందేందుకు ఆడంబరంతో చేసే తపస్సు చంచలం... క్షణికం అయివుంటుంది. ఇలాంటి దాన్ని రాజసమైన అస్థిర తపస్సు అంటారు. (17:18)

**తామస తపస్సు :**

విపరీత భావనతో తనకూ, ఇతరులకూ బాధ, ఉపదద్రం కలిగేలా చేసే తపస్సును... తామస తపస్సు అంటారు. (దుర్మార్గుల తపస్సు) (17 : 19.)

**సత్వ, రజస్తామో గుణాలనే ఈ మూడు గుణాల వారూ మీపై శ్రద్ధ పెట్టరా? ఏ గుణంతో వుంటే మీపై శ్రద్ధ వస్తుంది పరమాత్మ?**

**గుణాతీతుడికే.. పరబ్రహ్మస్థితి...**

శ్రీ భగవానుడు చెపుతున్నారు:
సత్త్వగుణ లక్షణమైన ప్రకాశం
రజోగుణ ధర్మమైన కర్మ ప్రవృత్తి,
తమోగుణ కార్యమైన మోహం
ఈ మూడు గుణాలకు అతీతంగా... గుణాలను అతిక్రమించిన వాడు.. ఎవడు వున్నాడో.. వాడు... నన్ను అమరుడు, అవినాశి, అఖండ సుఖస్వరూపుడైన పరబ్రహ్మగా నాపైన అనన్యభక్తితో భజిస్తాడో.. అతడు పరబ్రహ్మస్థితి పొందేందుకు అధికారం కలిగివుంటాడు. (14 : 22,25,26,27)

**గుణాతీడుడు చేసే తపస్సు ఎలా వుంటుంది?**

**వాచిక తపస్సు :**

మనస్సును నొప్పి కలిగింపక, సత్యాన్ని హితాన్ని, సంతోషాన్ని కలిగించేలా మాటలను మాట్లాడటాన్ని వాచిక తపస్సు అంటారు. (17:15)

**మానసిక తపస్సు :**

పవిత్రభావం, ప్రసన్నత, నెమ్మది, భావరహిత మౌనము, మనోనిగ్రహంతో వుంటే... మానసిక తపస్సు అంటారు. (17:16)

**సర్వవ్యాపి అయిన పరమాత్మ ఇంద్రియాలకు.. గుణాలకు బాధ్యత వహించడా?**

పరమాత్మ ఇంద్రియముల వృత్తులలో ప్రకాశిస్తోంది. సకల ఇంద్రియాలు... గుణాలను ఆయా విషయాల్లో అవి ప్రకాశించేలా చేస్తుంది. అయితే ఏ విధమైన ఇంద్రియాలతో పని లేనట్టింది. గుణాలకు అతీతమైంది. గుణాలపై అధికారం గలది. (13:15)

**పంచభూతాలతో వున్న శరీరం చేసే చర్యలకు... పరమాత్మది బాధ్యత కాదా?**

ఆ పరమాత్మ పంచభూతాలకు బయటా వుంటుంది. లోపలా వుంటుంది. స్థావరమైనది. జంగమమైనది. సూక్ష్మంగా వుండటం వల్ల తెలుసుకోలేనటువంటిది. జ్ఞానులకు దగ్గర... అజ్ఞానులకు దూరంలో వుండేటువంటిది. (13:16)

**ఆత్మ చేసే మంచి చెడ్డలకు పరమాత్మ బాధ్యత కాదా?**

ప్రతి శరీరంలోని... ఆత్మను రక్షిస్తోంది. పుట్టిస్తోంది. నాశనం కూడా చేస్తుంది. అయితే తెలుసుకోవాల్సిన పరమాత్మను తెలుసుకోనపుడు వేరుగా వుంటుంది. (13:17)

## నిత్యజీవితంలో... జంతుగుణాలు, స్వార్థమనుషులతో తట్టుకునే శక్తికి

# "స్థిత ప్రజ్ఞత" ఓ మహామంత్రం

మనుషులను "ఇగో" శాశిస్తోంది.
జంతువుల్లాంటి గుణాలున్న వారికి "ఇగో" తోడైతే... వారితో వున్న వారికి కూడా సమస్యలే. "బ్రహోత్సవ ఉపనిషత్తు"లో జంతుగుణాల నుంచి, మనిషి గుణాల గురించి తెలుసుకున్నాం.

జంతువుల్లాంటి గుణాలు, స్వార్థంతో నిండిపోయిన మనుషులతో తట్టుకోవాలన్నా... వారి ప్రభావం వల్ల అలా మారిపోకుండా వుండాలన్నా... స్థిత ప్రజ్ఞత ఒక మహామంత్రం.

మనసు చేరుకోవాల్సిన లక్ష్యం "స్థిత ప్రజ్ఞత".
ఈ లక్ష్యానికి చేరుకునే క్రమంలో అనేక పరీక్షలు అనుక్షణం ఎదురవుతూనే వుంటాయి.

పరీక్ష ఎదురైన ప్రతిసారి 'స్థిత ప్రజ్ఞత' అనే మాటను గుర్తు చేసుకుంటే.. అదే మంత్రం అవుతుంది.
"స్థిత ప్రజ్ఞత" ఒకసారి మంత్రంగా అలవాటు అయితే... తిరుగులేని శక్తిని అందిస్తుంది.
నిష్కామకర్మకు దారిని సుగమం చేస్తుంది.

భగవద్గీత స్థిత ప్రజ్ఞత గురించి ఏం చెప్పింది. ఆ స్థితి సాధించాలని మనసుకు ఆదేశిస్తే జరిగే అద్భుతాలు ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

### మనస్సు చేత తనను తాను ఉద్ధరించుకోవాలి

మానవుడు తనను తన మనస్సుచేతనే ఉద్ధరించుకోవాలి. తనకు తాను కించపరచుకోరాదు. తనకు తన మనసే బంధువు. ఇంకా ఆ మనస్సే తనకు శత్రువు కూడ.(6:5)

### తన మనస్సే తనకు శత్రువు కాకూడదంటే ఏమి చేయాలి?

మనస్సును స్వాధీనం చేసుకుని పరమాత్మతో అనుసంధానం చేయాలి (6:18)

### మనసు పరమాత్మతో అనుసంధానం అయితే ఎలా వుంటుంది?

గాలిలేనిచోట దీపం ఏవిధంగా నిశ్చలంగా ఉంటుందో , మనోనిగ్రహం కలిగి ఆత్మయోగం అభ్యసించేవాని మనస్సు అలా నిశ్చలంగా ఉంటుంది(6:19)

### ఆత్మపైనే మనసు నిలిపితే నిశ్చలత సాధ్యమా?

ధృడమైన బుద్ధితో మనస్సును ఆత్మ చింతనవైపు మరలిస్తే... సంకల్పాలవల్ల పుట్టిన కోర్కెలు.. ఇతర ఆలోచనలు... దు:ఖాలు ధ్యాన సమయంలో గానీ, సాధారణ సమయంలో కూడా ధరిచేరవు. (6:24,25)

### ప్రయత్నలోపంతో ఉభయభ్రష్టత్వం

ప్రయత్నలోపం వల్ల... ఆత్మయోగంలో మనస్సు చలిస్తే వాడికి యోగ ఫలం లభించదుగదా ! కర్మయోగం లోనూ విఫలుడవుతాడు. ఉభయభ్రష్టు డవుతున్నాడు. (6:37,38)

### ఉభయభ్రష్టత్వం కాకూడదంటే ఏమి చేయాలి?

చంచలమూ అస్థిరమూ అయిన మనస్సు ఏ కారణముచేతనైనా వైదొలగితే. ఆ కారణాల నుంచి మనస్సును నిరోధించి , దానిని మరలించి , ఆత్మకే స్వాధీనమయేటట్లు చేసుకోవాలి.(6:26)

### మనస్సు ఆత్మకు స్వాధీనం అయితే ఏమవుతుంది?

రజోగుణము తొలగి , కల్మషరహితమై శాంతిపడిన మనస్సు గలిగి , బ్రహ్మాకారము పొందిన యోగికి , ఉత్తమ సుఖము నిశ్చయమున ప్రాప్తిస్తుంది. (6:27)

### స్థిరజ్ఞాని.. జీవన్ముక్తుడు...
### స్థిత ప్రజ్ఞుడి లక్షణాలు ...

సమాధి స్థితిలో స్థిరజ్ఞానమును (స్థిత ప్రజ్ఞత) పొందినవాని లక్షణాలు ఏవి? ఆయన ఎలా మాట్లాడుతారు? ఎలా జీవిస్తారు? ఎలా ప్రవర్తిస్తారు? (2:54)

1. ఆత్మచేత... ఆత్మయందే సంతుష్టుడై వుంటారు (2:55)

2. ఎప్పుడూ మనస్సులో కోరికలన్నింటిని పూర్తిగావిడిచి పెట్టేస్తారు. (2:55)

3. దు:ఖంలోనూ కలతపడని మనస్సుగలవాడు (2:56)

4. సుఖాలలో ఆశలేనివాడు (2:56)

5. రాగము, భయము, క్రోధము లేని వాడు (2:56)

6. సకల విషయాల్లోనూ ఆసక్తిలేనివాడు (2:57)

7. ఇష్టమైనవి పొందినా.. ఇష్టం మైనవి పోగొట్టుకున్నా.... ఆనందం ద్వేషం లేనివాడు

8. ఇష్టలేనివి పొందినా.. ఇష్టలేనవి పోగొట్టుకున్నా... ఆనందం ద్వేషం లేనివాడు (2:57)

## ఆత్మకు 20 గుణాలు

క్షేత్రజ్ఞుడైన జీవుడు శరీరములో వున్నపుడు... అలవరచుకొనవలసిన స్వభావాలు 20 (13:8-12)

అవి

**1) గర్వ వుండకూడదు** : విద్యా, ధన, అందం ఇలా తనకు వున్నవి అనే భ్రమకు గురై... వాటితో తానే శ్రేష్టుడని మిడిసి పడే గర్వం వుండకూడదు.

**2) డాంభికం కూడదు:** తనను అందరూ కీర్తించాలనే డంభం వుండకూడదు.

**3) అహింస** : మనోవాక్కాయకర్మలతో ఇతరులకు చెడు చేయకూడదు.

4) తనకు అపకారం చేసిన వారిపట్ల క్షమాగుణం, ఓర్పు వుండాలి

5) త్రికరణ శుద్ధితో వుండాలి. అంటే.. తన మనస్సులో ఏది అనుకుంటారో.. దాన్నే చెప్పటం.. చేయటం.. అనే ఋజుత్వం వుండాలి.

6) ఆత్మవిద్యను తెలియజేసే గురువు పట్ల గౌరవం కలిగివుండాలి.

7) మనస్సు, శరీర శుద్ధితో జీవించాలి.

**8) ఆత్మ స్థైర్యం** : నేర్చుకున్న ఆత్మవిద్యను ఆచరించటంలో అంత: కరణ స్థైర్యం వుండాలి.

**9) ఆత్మనిగ్రహంతో** మనస్సు, శరీరంలను అదుపులో పెట్టుకోవాలి.

10) ఇంద్రియాల నిగ్రహంతో జీవించాలి.

11) అహంకారం లేకుండా జీవించటం : తాను ఆత్మను అని మరచిపోయి... తాను అంటే శరీరంగా భావించటం 'అహంకారం'. ఇది పోవాలి. శరీరానికి చెందినవన్నీ నావి అనే భావననే 'మమకారం' అంటారు. అహంకార, మమకారాలు పోవాలి.

12) శరీరం వల్ల వచ్చే దు:ఖాలైన వ్యాధులు, మరణం తదితరాలపై అవగాహనతో వుండటం.

13) ఆత్మ, పరమాత్మలపైనే మనస్సు పెట్టి.. జీవించాలి.

14) కుటుంబం, భార్య, పిల్లలే తాను అనే భ్రమతో జీవించకుండా వుండటం

15) ఇష్టంమైనవి వచ్చినా... పోయినా..., అయిష్టమైనవి పొందినా... పోయినా... ఒకే ఉద్వేగంతో ప్రాప్తించిన దానిపట్ల సమభావంతో వుండటం.

16) సర్వేశ్వరుడను, ఆత్మ స్వరూపుడను, సర్వజ్ఞుడను అయిన నా ఒక్కని యందే స్థిరమైన, నిశ్చలమైన భక్తి కలిగి వుండాలి.

17) ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఆటంకం కలిగించని గుణాలున్న మనుషులతో, పరిసరాల్లో వుండాలి.

18) ఆత్మ ధ్యానంలో ఎప్పుడూ నిష్ఠ కల్గియుండవలెను.

19) తాత్వికజ్ఞానం ప్రతిపాదించేదే పరమాత్మ అని తెలుసుకోవటం.

20) ఆత్మ విద్య ద్వారా జననమరణాలకు అతీతమైన అమరత్వం పొందటం లక్ష్యం అని అని గ్రహించాలి. (13 - 8,9,10,11,12)

# శరీరాన్ని అర్థం చేసుకుంటే జీవన్ముక్తి

బ్రహ్మోత్సవ ఉపనిషత్తులో శ్రీవారి బ్రహ్మోత్సవాల వాహనాలను వివరిస్తూ జంతు స్వభావం, మనిషి స్వభావం, ఆత్మ స్వభావం గురించి తెలుసుకున్నాం.

మనిషిలోని జంతు స్వభావాన్ని, మనిషి స్వభావాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకోవాలి.

ఆత్మ చెప్పినట్టు శరీరం అనుసరించాలా?

శరీరం చెప్పినట్టు ఆత్మ నడుచుకోవాలా?

ఇప్పుడు ఎలా నడుచుకుంటున్నారు?

ఎందుకు మనిషి శరీరం చెప్పినట్టు వింటున్నాడు?

అందుకు శరీరంలో ఏవేవి కారణం అవుతున్నాయి? ఇలాంటి సమగ్రమైన చర్చ భగవద్గీతలో వుంది. ఆ వివరాలు వున్న శ్లోకాలు ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

## శరీరం అంటే 24 తత్వాలు

ఆకాశాది పంచమహాభూతములు అహంకారతత్త్వము, బుద్ధి తత్త్వము, అవ్యక్తము, జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు పది, మనస్సొక్కటి, ఇంద్రియ విషయములైదు, ఇచ్ఛ, ద్వేషము, సుఖము, దు:ఖము, దేహేంద్రియములచేరిక, జ్ఞానాత్మకమైన అంత:కరణవృత్తి, ధైర్యము, ఇట్టి వికారములతో గూడిన ఈ క్షేత్రము (దేహము) సంక్షేపముగ జెప్పబడినది.

## 'క్షేత్రం' అని పిలిచే శరీరంలో...

భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశము అనే "పంచ (ఐదు) భూతాలు". ఈ అయిదుతో పాటు...

6. అహంకారం అనే తత్వం
7. 'మహత్తు' (బుద్ధి) అనే తత్వం
8. ఈ ఏడింటికి కారణమైన 'మూలప్రకృతి' (అవ్యక్తం) అనే తత్వంఇలా మొత్తం 8 జడ ద్రవ్యాలతో తయారైంది ఈ శరీరము.

**అయిదు కర్మేంద్రియాలు(5)** : వాక్కు, హస్తం, పాదం, మలద్వారం, మూత్రద్వారం

**అయిదు జ్ఞానేంద్రియాలు(5)** : స్పర్శ తెలిపే (చర్మం), రూపాన్ని తెలిపే (కన్నులు), వాసనను తెలిపే (ముక్కు), శబ్దాన్ని తెలిపే (చెవి), రుచిని తెలిపే (నాలుక),

**దీంతో పాటు ఇంద్రియ విషయాలు (5)**

ఇచ్ఛ, ద్వేషము, సుఖము, దు:ఖము, దేహేంద్రియములచేరిక, జ్ఞానాత్మకమైన అంత:కరణవృత్తి, ధైర్యము, అనే ఐదు విషయాలు.

ఐదింటికి, మనస్సు అనే అంతరింద్రియ మొకటికి(1)

మొత్తము (5+5+1+5) పదహారింటికి ఆశ్రయమె వుంటుంది.

అంటే మొత్తము 8+16=24 తత్వాలు కలసి 'క్షేత్రం'గా పిలువబడుతోంది. (13:5)

## క్షేత్రంతో చేరటం వల్లే (శరీరం వల్లే) ఆత్మకు కోరికలు

క్షేత్రంతో ఆత్మ చేరటం వల్ల, క్షేత్రం... ఆత్మలో కోరికలు పుట్టిస్తోంది. కోరికలు తీరటం వల్ల సుఖం కలుగుతోంది. కోరికకు గానీ, దాని వల్ల కలిగిన సుఖానికి గానీ ఆటంకం కలిగినపుడు... వానిపై ద్వేషము పుట్టిస్తోంది. ద్వేషం వల్ల దుఃఖం కలుగుతోంది. ఇలా శరీరం వల్ల కలిగిన కోరిక, సుఖం, ద్వేషం, దు:ఖం అనే నాలుగు వికారాలు క్షేత్రం కలిగిస్తోంది. (13:6)

# ఆత్మతోనే ఇంద్రియ నిగ్రహం...

ఇంద్రియ నిగ్రహంతోనే నిర్మల బుద్ధి... దు:ఖనాశనం

శరీరానికి ఆత్మ బానిస అయి... శరీరం చూపించే మార్గంలో పోవాలా? శరీరం ఆత్మ చెప్పినట్టు వినేలా చేసుకోవాలా?
శరీరం... ఆత్మ చెప్పినట్టు వినేటట్టు చేయటమే మనిషి ముందున్న లక్ష్యం.

ఆత్మ ఆదేశాన్ని శరీరం... వినేలా చేయాలంటే ఏం చేయాలి?
శరీరానికి ఆత్మ ఇచ్చిన ఆదేశం అమలు చేసే స్థాయికి మనసు ఎదగాలి. అందుకు స్థిత ప్రజ్ఞత ఉపయుక్తం అవుతుంది.
మనసు చెప్పినట్టు శరీరం వినాలంటే...

శరీరానికి క్రమశిక్షణ అవసరం. అదే "ఇంద్రియ నిగ్రహం" ఇంద్రియ నిగ్రహం గురించి... భగవద్గీతలో ఎక్కడెక్కడ ఏమి చెప్పారో ఈ అధ్యాయంలో తెలుసుకుంటాం.

## ఇంద్రియాలు చేసే సమస్త కర్మలకు కారణం ఏవి?

సమస్త కర్మలకు అయిదు కారణాలు. అవి...
1. కర్మాచరణకు ఆధారమైన **శరీరము**
2. కర్తృత్వాభిమానము వహించి అహంకరించు జీవుడు
3. ఇంద్రియాల కర్మాచరణకు ఉపయుక్తమయ్యే అతర్ కారణాలైన మనోబుద్ధులు.
4. ఇంద్రియాల కర్మాచరణకు బాహ్యకారణాలైన సంయోగ వియోగాలతో ఏర్పడిన వివిధ వ్యాపారములు
5. దైవము లేక విధి (పూర్వకర్మ ఫలితము లేక ప్రారబ్ధము). (18 : 14)

## ప్రాణులను ఏదీ నడిపిస్తుంది ?

ప్రాణులకు **పూర్వజన్మ వాసన**కు తగినట్టే గుణాలుంటాయి.
అలా ప్రాణులన్నీ తమతమ గుణాలను అనుసరించే నడుచుకుంటున్నాయి.(3:33)

## ఇష్టాలు... పెంచుకుంటే ఇంద్రియనిగ్రహానికి ఇబ్బంది...

కొన్నిటిపట్ల ఇష్టం... మరి కొన్నిటి పట్ల అయిష్టం **(రాగద్వేషాలు)** ఆయా ఇంద్రియాల లక్షణం. ఆ రాగద్వేషాలకు లోబడకూడదు. అది ఆత్మకు విరోధులై వున్నాయి. (3:34)

## కోరికలు... జ్ఞానాన్ని కప్పేయకూడదు...

ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, ఇవి **కామము (కోరిక)** నకు నివాస స్థానం. ఈ కామము ఇంద్రియము, మనస్సు, బుద్ధి, వీటి ద్వారా జ్ఞానమును కప్పి దేహిని (జీవాత్మను) మోహింపజేస్తోంది. (3:40)

## ఇంద్రియాలు... మనుస్సును ఆత్మ తన వశం చేసుకోవాలి...

కోరిక (కామం) అనర్థానికి మూలం. నీవు (ఆత్మ) మొదట ఇంద్రియములు, మనస్సు, బుద్ధి వీటిని వశం చేసుకోవాలి.
జ్ఞాన విజ్ఞానాలను పొగొడుతున్న అనుభవ జ్ఞానాన్ని నశింపజేస్తున్న పాపస్వరూపమైన ఈ **కోరికలను విడిచిపెట్టు**.(3:41)

## కోరికలను జయించటం ఎలా?

స్థూల దేహం కంటె ఇంద్రియములు మేలైనని. ఇంద్రియాలకంటే మనస్సు మేలైనది. మనస్సు కంటె బుద్ధి శ్రేష్ఠమైనది. బుద్ధికంటె శ్రేష్ఠమైనది... సాక్షిగా వుండే... ఆత్మ. (3:42)

## ఆత్మతో కోరికలను నాశనం చేయాలి...

బుద్ధికంటె శ్రేష్ఠమైన ఆత్మను తెలుసుకోవాలి. ఆత్మచేత కామమనే (కోరికలు) శత్రువును నశింపజేయాలి.(3:43)

## ఇంద్రియాలను నిగ్రహించుకుంటే చాలా ?

కర్మేంద్రియాలైన వాక్, పాణి , పాద , పాయూ, ఉపస్థలను నిగ్రహించుకుని, ఇంద్రియ విషయాలైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంథాలను మనసులో స్మరించుకుంటాడో అలాంటి వారిని కపటి అంటారు. (3: 6)

## 'కపటి'లా కాదు.. మనసుతో కర్మలు చేయాలి...

ఏ పని చేయకుండా వుండటం మంచిది కాదు. మనస్సు చేత ఇంద్రియాలను నిగ్రహించి కర్మేంద్రియాలతో విహితమైన కర్మ చేసే వాడు శ్రేష్టుడు. (3:7,8)

## ఇంద్రియ సుఖ.. దు:ఖాలపై సమభావం... మోక్షప్రాప్తికి అర్హులు...

ఇంద్రియాల వల్లే సు:ఖ దు:ఖాలు తెలుస్తున్నాయి. శీతగ్రీష్మం వంటి వాతావరణ మార్పులు ఎలా శాశ్వతం కావో అలాగే చెవి, కన్ను, నాలుక, చర్మం, ముక్కు వంటి ఇంద్రియాల వల్ల తెలియవచ్చే వాసన , రుచి, రూపం , స్పర్శ , శబ్దము, మరణం, జననం వంటి సు:ఖ, దు:ఖాలు కూడా శాశ్వతం కాదు. ఈ గ్రహింపుతో ఓర్పుగా జీవించాలి.

అనివార్యాలైన వాతావరణ మార్పులను సమభావంతో గ్రహించినట్టే.. ఇంద్రియాల వల్ల కలిగే సు:ఖ, దు:ఖాలను సయితం సమభావంతో స్వీకరించే ధీరాత్మగల (ప్రశాంతాత్మగల) వారు మోక్షప్రాప్తికి అర్హులు. (2:14,15)

## ఆహారంతో ఇంద్రియ నిగ్రహం...

తగుమాత్రంగా ఆహార విహారాదులు , క్రియా వ్యాపారాలు కలిగి (అతినిద్ర లేకుండా , అలాఅని అసలే నిద్ర లేకుండా ఉండక) తగు మోతాదులో నిద్రపోవడం మేల్కోనడం కలిగివున్న పురుషునికి ఈ యోగం దు:ఖాన్ని పోగొడుతుంది. (6:17)

## ఆత్మసుఖంతో... ఇంద్రియనిగ్రహం...

ఇంద్రియ వ్యసనాలతో మాత్రమే జీవించేవాడికి ఆత్మ సుఖం స్థితి అర్థం కాదు. ఈ స్థితి బుద్ధికి మాత్రమే తెలుస్తుంది. ఒకసారి ఆత్మసుఖాన్ని స్థిరంగా తెలుసుకున్న తరువాత.. అతను ఆ స్థితి నుంచి మళ్లీ పూర్వస్థితి అయిన ఇంద్రియలోలత్వంలోకి వెళ్లాలనుకోడు.

అలా ఆత్మసుఖంలోనే స్థిరంగా వుండగలిగే స్థితి లభిస్తే.. యోగసిద్ధి కలుగుతుంది. అటువంటి యోగాన్ని నిస్సంశయం వ్యసనరహితం అయిన మనస్సుతో అభ్యసించాలి. (6:21, 23)

## యోగంతో ఇంద్రియ నిగ్రహం...

చిత్తము ఇంద్రియములు వీటి వ్యాపారములను అణచినవాడై అంత:కరణశుద్ధికై యోగమును జేయాలి. (6:12)

## స్థిర బుద్ధి ఎలా సాధ్యం?

తాబేలు తన అవయవాలను తనలో ముడుచుకొనేటట్లు యోగి అయినవాడు తన ఇంద్రియాల నన్నిటినీ విషయాలనుండి ఎప్పుడు ఉపసంహరించుకుంటాడో అప్పుడు వాని బుద్ధి నిశ్చలం అవుతుంది. (2:58)

## స్థిరబుద్ధిని... శాంతిని ఎందుకు సాధించలేక పోతున్నారు? ఇంద్రియ నిగ్రహం ఇందుకు ఎలా దోహదపడుతోంది?

పురుషుడు ఇంద్రియ ఆసక్తిగల విషయాలను ఆలోచించటం చేత వానిపట్ల అతనికి ఆసక్తి కలుగుతుంది. ఆ ఆసక్తి వల్ల కోరిక కలుగుతుంది. కోరిక (తీరకపోవటం) చేత క్రోధం కలుగుతుంది.

క్రోధంవల్ల మోహము, ఆ మోహంవల్ల విచక్షణాశక్తి (ఆత్మోన్నతి లక్ష్యం) కోల్పోతున్నాడు. ఆ విచక్షణాశక్తి నశించడంతో బుద్ధినాశనం అవుతోంది. బుద్ధి నశించగానే తానే (లక్ష్యం తప్పి) నశిస్తున్నాడు. (2:62,63)

ఇంద్రియాల ద్వారా గ్రహించే <u>ఇంద్రియ</u> <u>ఆహారాలను</u> <u>మాత్రమే</u> <u>విడచినవానికి</u> ఇంద్రియ విషయాలు మాత్రమే వదలి పోతాయి. కాని అతని లోపల ఇంద్రియాలు ఆహారంగా స్వీకరించగల వాటిపట్ల <u>అభిలాష</u> <u>మాత్రం</u> <u>అలాగే</u> <u>వుంటుంది.</u> (2:59)

ఇంద్రియ నిగ్రహంలేని వానికి (ఆత్మజ్ఞాన) వివేకం కలుగదు. అయుక్తునికి ఆత్మ ధ్యానం కలగదు. ఆత్మధ్యానం లేనివానికి చిత్తశాంతి కలగదు. చిత్తశాంతి లేనివానికి సుఖములేదు. (2:66)

జ్ఞానవంతుడైన వాడు ఎంత పూనికతో ఇంద్రియములను వశపరచు కునేందుకు ప్రయత్నించినా ఇంద్రియాలు వాని మనస్సును బలవంతంగా లాక్కుపోతాయి. (2:60)

## అన్ని ఇంద్రియాలను ఒకేసారి స్వాధీనం చేసుకోవటం సాధ్యమా? ఇంద్రియ నిగ్రహానికి మనస్సు ఎలా సహకరిస్తుంది?

మనస్సు ఇంద్రియాలను (ఏదో ఒక్క ఇంద్రియాన్నైనా సరే) అనుసరిస్తే... అటువంటి మనస్సు సముద్రంలో పెనుగాలి ఓడను ఈడ్చుకుపోయినట్టు... పురుషుని వివేకాన్ని (బుద్ధిని) ఆ ఇంద్రియమే హరిస్తుంది.(2:67)

మనస్సుకు స్వాధీనమైన ఇంద్రియాల చేత రాగద్వేషాలకు అతీతమైన విషయములను అనుభవిస్తూ నిర్మలచిత్తాన్ని (క్రమంగా) పొందుతున్నాడు. (2:64)

పరమాత్మను పొందటమే లక్ష్యంగా పెట్టుకున్న యోగి... (ఎన్ని వ్యాపకాల్లో వున్నా) పరమాత్మపైన మనసును స్థిరపరచి ఇంద్రియాలను మనో స్థైర్యంతో (కొంత కొంతగా) వసం చేసుకుంటాడు. ఇలా ఇంద్రియాలను వసం చేసుకున్న వారి ప్రజ్ఞ స్థిరంగా వుంటుంది. (2:61)

ఆ అభిలాష కూడ <u>పరమాత్మను</u> <u>దర్శించిన</u> <u>పిమ్మట</u> అతని నుంచి వదలి పోతుంది. (2:59)

## నిర్మల బుద్ధికి... మనసు... ఇంద్రియాలు ఎలా దోహదపడతాయి?

ప్రసన్నమై, నిర్మలమైన మనస్సుగలవానికి శీఘ్రంగా బుద్ధి స్థిరపడుతుంది. (2:65)

ఎవడు తన ఇంద్రియాలనన్నిటినీ వాని విషయాలనుండి నిగ్రహించు కొంటున్నాడో అతని బుద్ధి నిశ్చలమవుతుంది.(2:68)

అహంకార, మమకారాలను లేకుండా సంచరించేవాడు శాంతిని పొందుతాడు. (2:71)

## నిర్మల బుద్ధి వల్ల ఏం నశిస్తాయి?

నిర్మలత్వం కలగడంవల్ల ఇతనికి సమస్త దుఃఖములు నశిస్తాయి. (2:65)

# దేహత్యాగ సమయంలో ఎలా వుండాలి?

భూమిపైకి వచ్చినపుడు.... బాల్యంలో మనిషి ఎలా వున్నాడు... ? తిరిగి వెళ్లేపుడు ఎలా వుండాలి?
ఈ రెండూ కీలకం. వెళ్లేపుడు వచ్చినప్పటికంటే ఉన్నతంగా వున్నారా? లేరా? అదే కీలకం.... మనిషి మరణించే సమయం అంటే...దేహాన్ని త్యాగం చేసే క్షణాల్లో ఎలా వుండాలో భగవద్గీత చెపుతుంది. ఆ క్షణం అలా వుండాలంటే... ముందు నుంచే అందుకు సిద్ధపడితే గానీ సాధ్యం కాదు అని కూడా భగవద్గీత స్పష్టంగా చెపుతోంది.
ఇంతకూ దేహత్యాగం సమయంలో ఎలా వుండాలని భగవద్గీత చెపుతోందో ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

## మరణ సమయంలో ఎలా వుండాలి?

ఎవడు అంత్యకాలంలో నన్నే ధ్యానిస్తూ శరీరం వదలుతున్నాడో , వాడు నన్నే పొందుతున్నాడు. ఇందులో ఎంత మాత్రం సందేహంలేదు. (8:5)

పురుషుడు అంత్యకాలంలో చలింపని మనస్సుతో ఏఏ భావాలను స్మరిస్తూ శరీరాన్ని వదలుతున్నాడో , అతడు ఆయా భావాల కనుగుణమైన రూపాన్నే పొందుతున్నారు. (8:6)

## మరణ సమయంలో దైవాన్ని సరైన రీతిలో స్మరించాలంటే... జీవించి వున్నపుడు ఎలాంటి ఆధ్యాత్మిక చైతన్యంతో వుండాలి?

(పరమాత్మ ఐన నన్ను ఎల్లప్పుడు మనస్సులో వుంచుకున్న వాడు... మరణకాలంలో కూడా నన్నే మనస్సులో కలిగి వుంటాడు) కాబట్టి అన్ని కాలాల్లోనూ పరమాత్మను(నన్ను) స్మరిస్తుండాలి. యుద్ధం చేస్తున్నా... సరే... పరమాత్మపైన మనస్సునూ, బుద్ధినీ వుంచిన వాడివైతే నన్నే పొందగలవు. ఇందులో సంశయం లేదు.(8:7)

## పరమాత్మను ఏ రూపంలో ధ్యానించాలి?

అభ్యాసం అనే యోగంతో కూడినది. వేరే విషయాల్లో ప్రవేశించనిది అయిన మనస్సుతో ప్రకాశ **రూపమైన పరమపురుషున్ని** (బ్రహ్మను) క్రమంగా ధ్యానించువాడు పరమ పురుషునే పొందుతాడు.(8:8)

## రకరకాల దేవుళ్లను నమ్మకుండా వుంటే మరణ సమయంలో కలిగే మేలు ఏమి?

ఎవ్వడు వేరే విషయాల్లో మనస్సును పెట్టకుండా... ఎడతెగక నన్ను స్థిరంగా స్మరిస్తాడో, ఎల్లప్పుడు స్థిరమైన మనస్సుగల అలాంటి యోగికి నేను సులభుడను (సులభముగా పొందదగినవాడను).(8:14)

## సత్యాన్ని తెలుసుకున్న యోగి మరణం ఎలా వుంటుంది?

అంత్యకాలములో చలించని మనస్సుతో భక్తి కలిగి. యోగబలంతో. భ్రూమధ్యంలో ప్రాణం నిలిపి , పరమ పురుషుని ఎవడు స్మరిస్తాడో, అటువంటి యోగి దివ్యుడు - సర్వోత్కృష్టుడు అయిన ఆ పరమ పురుషుణ్ణే పొందుతున్నాడు. (8:10)

## మరణ సమయంలో 'ఓం' ఉచ్ఛరణ

ఎవ్వడు తన సకల ఇంద్రియ ద్వారాలను అణచి, మనస్సును హృదయ కమలములో స్థిరముగ నిలిపి, తన ప్రాణమును శిరస్సులో నిలబెట్టి, స్థిరమైన యోగధారణను ఆశ్రయించి, బ్రహ్మనికి పేరైన ' ఓం ' అనే ఏకాక్షరాన్ని ఉచ్చరిస్తూ నన్ను చింతిస్తూ ఎవడు దేహాన్ని వదలుతున్నాడో అటువంటివాడు పరమోత్కృష్టమైన మోక్షమును పొందుతున్నాడు. (8:12,13)

## మరణ సమయంలో అలా మరణించిన వారు ఎక్కడకు చేరుకుంటారా?

నన్ను ఆశ్రయించి శ్రేష్ఠమైన మోక్షమును పొందిన మహాత్ములు (యోగులు) మరల దు:ఖాలను కలిగించే అనిత్యమైన ఈ జన్మాంతరమును పొందుట లేదు. (8:15)

ఏ పరబ్రహ్మము ఇంద్రియాలను గోచరం గాక నాశరహితంగా ఉందో అదే ఉత్కృష్టమైన మోక్షస్థానము , ఆ స్థానాన్ని పొందినవారికి మరల జన్మలేదు. అదే నా స్థానమైన పరమపదం, పరమ ధామము.(8:21)

వేదములలోను, యజ్ఞములలోను, తపస్సులలోను, దానముల లోను ఏయే పుణ్యఫలము చెప్పబడిందో అలాంటి ఫలాలను జ్ఞాన యోగి అల్పంగా తలుస్తాడు. దీని తెలుసుకోవటం వల్ల ఉత్తమమైన ఉన్నత స్థానాన్ని పొందుతున్నాడు.(8:28)

## మీరు చెప్పిన మార్గంలో నడవక ద్వేష బుద్ధితోనే జీవించి చనిపోతే ఏమవుతుంది?

ద్వేషబుద్ధి నాశ్రయించి క్రూర కర్ములైన ఆ మానవ అధములు... అదే రకంగా అధమైన తీరులో జీవించే జీవిలా మరల మరల జన్మలెత్తిస్తాను.(16:19)

ఇలా ప్రతి జన్మజన్మకు మూఢత్వము, అవివేకము పెరిగి పెరిగి.. నన్ను పొందటం తెలయని స్థితిలో అదోగతికి చేరుకుంటారు. (16:20)

### సత్వగుణంతో మరణిస్తే...

తనలోని సత్త్వగుణము వృద్ధిలో వున్నపుడు మనిషి మరణిస్తే... సత్త్వగుణ విశిష్టులు ఊర్ధ్వలోకాలను చేరుకుంటారు.(14:18) నిర్మలమైనా ఉత్తమజ్ఞానులు పొందే పుణ్యలోకాలను పొందుతారు.(14:14)

### రజోగుణంతో మరణిస్తే...

తనలో రజోగుణం అధికంగా వున్నపుడు చనిపోతే.. రాజసులు భూలోకంలోనే వుండి... (14:18) కర్మ చేయటంలో ఆసక్తి వున్న మనిషిగా జన్మిస్తారు.(14:15)

### తమోగుణంతో మరణిస్తే...

తమోగుణం అధికంగా వున్నపుడు చనిపోతే... అథోలోకాలకు వెళ్లి... (14:18)
జంతువుగా జన్మిస్తారు.(14:15)

### సత్వ... రజో.. తమో గుణాలను వదిలేస్తే...? పరమపదం పొందవచ్చా?

సత్వరజస్తమో గుణాలు నరకద్వారాలు. ఈ మూడుగుణాలను దాటిన మనిషి... తనకు తాను శ్రేయస్సును చేసుకున్న వాడు అవుతాడు. పరమపదాన్ని సాధించుకుంటాడు. (16:22)

### పరమపదం వర్ణన

ఆ అవ్యయ పదాన్ని సూర్యుడు గాని, చంద్రుడు గాని, అగ్నిగాని ప్రకాశింప జేయజాలదు. ఏ పదమును చేరిన వెనుక మరల తిరిగిరారో ఆ పరమోత్కృష్టమైన పరమపదమే నా స్థానము.(15:6)

### పరమాత్మ నిజరూపాన్ని తెలుసుకుంటే విముక్తి

ఎవ్వడు నన్ను ఆదిలేనివాడు, జనన రహితుడు, సకల లోకాలకూ ఈశ్వరుడు అని తెలుసుకుని (ఆ భావనలో ధ్యానిస్తుంటాడో) అతడు మనుష్యులలో మోహము తొలగినవాడు. అనగా అజ్ఞానములేనివాడు. సకల పాపముల (కర్మబంధాల) నుండి విడువబడుచున్నాడు. (10:3)

### దుర్మార్గులూ మనసు మార్చుకుని... ఇలాంటి సాధన చేస్తే ముక్తి సాధ్యమా?

దుర్మార్గుడైనా అనన్య భక్తితో నన్నారాధిస్తే అతడు సజ్జనుడు అవుతాడు. అతడు ధర్మయుక్త ముగ వ్యహరించి యున్నాడు కనుక! అతడు వెంటనే ధర్మాత్ముడై శాశ్వతమైన శాంతిని పొందుతున్నాడు. నా భక్తుడు ఎన్నటికీ నశించడు.(9: 30, 31)

# మరణానికి ముందే జీవన్ముక్తి...

అన్ని ప్రాణుల పట్ల సమత్వభావం...గురించి పదే పదే చెప్పిన శ్లోకాల వివరాలు ఈ అధ్యాయంలో తెలుసుకుంటాం. ముక్తికి సమత్వం భావం అత్యంత కీలకమని పరమాత్మ చెప్పిన తరువాత... వాటిని వక్రీకరిస్తే ఎలా అంగీకారం అవుతుంది. ఈ అధ్యాయం చదివిన తరువాత మొదటి అధ్యాయంలో కొన్ని అంశాలను భగవద్గీత నుంచి తొలగిస్తున్న ప్రకటించటం సబబు అని స్పష్టం అవుతుంది.

## జీవన్ముక్తి అంటే...!

మరణించిన తరువాత ఎక్కడకు పోతాం? ఏమవుతాం? వీటి గురించి చింతపడటం కాదు...జీవించి వున్నపుడే ముక్తి పొందుతాం అనే నమ్మకాన్ని కలిగి వుండే ఆత్మస్థితికి మనిషిని తీసుకుపోవటమే భగవద్గీత లక్ష్యం. జీవించి వున్నపుడే ముక్తిస్థితిని పొందటాన్నే "జీవన్ముక్తి" అంటారు. జీవన్ముక్తి అంటే ఏమి?
ఎలా సాధించాలి? అందుకు సమతాభావం ఎలా ఉపయుక్తం అవుతుంది. ఇలా జీవన్ముక్తి గురించి భగవద్గీత ఏం నేర్పిందో ఈ అధ్యాయంలో తెలుసుకుంటాం.

## సకల ప్రాణకోటి పరమాత్మలో...

ఎవ్వడు పరమాత్మనైన నన్ను సకల ప్రాణకోటిలో చూస్తాడో... అలాగే నాలో సకల ప్రాణకోటిని చూస్తాడో... అతడికి నేను కనబడకుండా వుండటం లేదు. నాకు అతను కనబడకుండా వుండేది లేదు. అలాంటి వ్యక్తి నాతో వుంటాడు. (6:30,31)

## నిష్కామ ఉపకారిగా మిత్రుడిగా... పరమాత్మను తెలుసుకోవటం

సకల లోకాలకు ఈశ్వరుడు (యజమాని - ప్రభువు) గను, సకలప్రాణులకు ప్రత్యుపకారం ఎదురుచూడకుండా ఉపకారం చేసే మిత్రుడుగా నన్ను ఎవరు తెలుసుకుంటారో అతడు శాంతిని, మోక్షాన్ని పొందుతాడు.(5:29)

## జీవుల యడ సమదృష్టితో జీవన్ముక్తి...

ఎవరిమనస్సు సమత్వం కలిగిఉందో , వారీలోకంలో ఉండగానే పునర్జన్మను జయించారు. వారికిక జన్మలేదు. బ్రహ్మనిర్దుష్టమైనది , సమమైనది. కనుక వారు జీవన్ముక్తి పొందుతున్నారు.(5:19)

## సమబుద్ధి.. వ్యాప్తితత్వ ఆరాధనతో నా వద్దకు...

ఎవరు ఇంద్రియాలను అణచి ఎల్లప్పుడు సమబుద్ధితో... సకల ప్రాణులకు హితం కోరుతూ, అగోచరం, అప్రకటితం, మనస్సుతో గ్రహింపజాలని వ్యాప్తితత్వం, కూటస్థం, అచలనం, శాశ్వతం అయిన నిర్గుణ బ్రహ్మను ఉపాసిస్తారో వారు నన్నే వచ్చి చేరుతారు. (12:3,4)

## ఏ జీవిపట్ల శత్రుభావం లేకుండా... కర్మచేస్తే నన్నే పొందుతారు...

సమస్త భూతములందు శత్రుత్వం లేక, నా భక్తుడై, నన్నే పరమగతిగా నమ్మి, నా కొరకే కర్మలు చేయువాడు, నన్నే పొందుచున్నాడు.(11 : 55)

## సమతా భావం వున్నవాడు... నేను వేరు వేరు కాదు...

యోగంలో చక్కగ లగ్నమైన సాధకుడు సర్వభూతాలతో ఆత్మను, ఆత్మలో సర్వభూతాలను, చూచుచున్నాడు. అతడెల్లడల సమదృష్టి కలిగియున్నాడు. (6:29)

ఎవడు సమస్త భూతాలను నాలోనూ , సమస్త భూతాలలో నన్నూ చూస్తున్నాడో వాడికంటే నేను వేరుకాను. నాకంటె వాడు వేరుకాడు. (6:30)

బ్రహ్మ స్వరూపాన్ని పొందినవాడు ప్రసన్న మనస్కుడై దేనిని కోరకుండా, దేనికీ దుఃఖించక వుంటాడు. అతడు సర్వభూతాల యడ సమదృష్టి, ఆత్మదృష్టి కలిగి నా యందు ఉత్తమభక్తిని పొందుతాడు. (18:54)

## త్రిగుణాలున్న వాటిలో నేను లేను...

వేటిలో సత్త్వరజస్తమోగుణములను వున్నాయో... అవి నా చేతే కలిగినా... నేను వాటిలో లేను. అవి నాయందు వున్నాయని తెలుసుకో. (7:12)

## సమస్త భూతాలయందు నాకు సమభావమే...

సమస్త భూతములందు నాకు సమభావమే ఉంది. ద్వేషింపదగినవాడు గాని ప్రియమైన వాడుగాని నాకు లేడు. ఎవరైతే నన్ను భక్తితో ఆరాధిస్తున్నారో వారిలో నేను ఉన్నాను. నాలో వారు ఉన్నారు.(9: 29)

## అనన్యభక్తితో వ్యాప్తి తత్వాన్ని పొందవచ్చు...

ఎవరిలో ఈ ప్రాణికోటి జీవిస్తోంది. ఎవరు ఈ ప్రాణికోటి యంతటా వ్యాపించి ఉన్నాడో అట్టి పరమపురుషుడు. అనన్యభక్తిద్వారా పొందవచ్చును.(8 : 22)

## జీవన్ముక్తుడు ఏలా జీవిస్తారు ?

బ్రాహ్మయందు స్థిరపడిన బ్రహ్మజ్ఞాని భ్రమను వదలి స్థిరబుద్ధిగల వాడు (స్థిత ప్రజ్ఞుడు) అవుతాడు. మోహం వుండదు. ఇష్టమైనవి పొందినపుడు సంతోషింపరు. అయిష్టమైనవి పొందినపుడు దు:ఖింపరు. (5:20)

బాహ్యాలైన శబ్దాది విషయాలపై ఆసక్తి వుండదు. ఆత్మధ్యానంలో అత్యున్నత సుఖాన్ని పొందుతుంటాడు. (5: 21)

అనిత్యాలైన భోగాలు చివరకు దు:ఖానికి కారణాలు. జ్ఞాని వాటిపై ప్రీతి చూపడు. (5:22)

దేహత్యాగం చేసేవరకు కూడా కామం, క్రోదాలనే ఉద్వేగాలను అదుపులోవుంచుకుంటాడు.యోగిలాఆనందంగా వుంటాడు.(5:23)
ఆత్మానందాన్ని పొందటం తెలిసి... అందులోనే బ్రహ్మానందాన్ని పొందుతూ జీవన్ముక్తిని పొందుతాడు (5:24)

సందేహాలు వుండవు. పుణ్యపాపాలు లేని స్థితిలో వుంటూ... సర్వజీవజంతువుల శ్రేయస్సును కాంక్షిస్తూ జీవిస్తుండే వీరికి, వారు జీవించి వున్నపుడూ... దేహత్యాగం చేసిన తరువాత బ్రహ్మ నిర్వాణ స్థితినే పొందుతారు.(5:25,26)

చిత్తాన్ని పరమాత్మకు అంకితం చేసి... పూర్ణ శ్రద్ధతో భజించువాడు శ్రేష్ఠుడు. (6:47)

## దేవుడి పట్ల చపలత్వం లేని వారు శ్రేష్ఠులు...

పరమేశ్వరుడనైన నాయెడ మనస్సును నిలబెట్టి ఎల్లప్పుడు ఏక నిష్ఠతో, శ్రేష్ఠమైన శ్రద్ధతో ఎవ్వరు పరమేశ్వరుడైన నన్ను ఉపాసించుచున్నారో అలాంటి శ్రేష్టులు నాకు సమ్మతమైనవారు. (12:2)

సకలకర్మలను నాకు సమర్పించి నన్నే మేలైన గతి అని (నన్ను తప్ప, మరి ఎవ్వరినీ దైవంగా) గ్రహించి అనన్యమైన, సమాధి యోగం చేత నన్ను ధ్యానిస్తూ ఉపాసిస్తూ వున్నారో, నాపైనే మనస్సు గలవారున్నారో... అలాంటి వారిని జనన మరణాలనే సంసారం నుంచి శీఘ్రంగా నేను తరింపజేస్తున్నాను. (12:6,7)

మనస్సును నాపైనే స్థిరముగా నిలబెట్టేందుకు శక్తిలేని వాడైతే, కొంత కాలం అభ్యాసంతో నన్ను పొందేందుకు ప్రయత్నం చేస్తాడు. (12:9)

ఎవ్వడు నా విభూతి స్వరూపాన్ని యోగైశ్వర్యాన్ని వాస్తవంగా తెలుసుకుంటారో, అతడు నిశ్చయంగా యోగంతో వున్నాడు. ఈ విషయంలో సందేహం లేదు. (10:7)

## ఎవరికి జనన మరణాలు రావు?

ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి వీటిని అణచి,
కోరిక, భయము, కోపము వీటిని వదిలి...
మోక్షాన్నే శ్రేష్టమైన గతిగా నమ్మి..భగవంతున్ని ఎల్లప్పుడు మననం చేసే ముని ఎవ్వడో అతను ముక్తుడే.
జనన మరణాల నుంచి విడువబడినవాడే. (5 : 27,28)

## గుణాతీతుడికి దైవీకస్థితి

గుణాలకు అతీతంగా పరమాత్మను తెలుసుకున్నాడో... అతను నా తత్వాన్ని అంటే దైవీక స్థితిని పొందుతున్నాడు. (14:19)
దేహోత్పత్తికి కారణమయ్యే ఈ మూడు గుణాలను అతిక్రమించి దేహి జనన మరణ జరాదుఃఖములతో నిండిన సంసారమునుండి ముక్తుడై నాశ రహితమగు మోక్షము పొందుతాడు. (14:20)

## కర్మ సన్యాసికి పరమపదం ఖాయం

సన్న్యాశ్రయించి సర్వకర్మలను సదా నిర్వర్తించుచున్నను అతడు నా యనుగ్రహము వలన నాశరహితమును శాశ్వతమును అగు పరమ పదము నధిష్ఠించును. (18 : 56)

మనస్సుచే నీ కర్మల నన్నిటిని నాయందు నన్న్యసించి, అనగా నాకర్పించి నిష్కామబుద్ధితో యోగనిష్ఠుడవై సదా నన్నే చింతించుచు నాయందే మనస్సును విలీన మొనర్పుము. (18:57)

**కర్మపరిత్యాగం (కర్మను వదిలి పెట్టడం) వల్ల మోక్షం పొందడు.** (3 : 4,5)
సమస్త జీవుల్లో వుండే ఆత్మ తాను గాను , తాను సమస్త భూతములయందుండు ఆత్మగాను ఎవరు తెలిసికొను చున్నాడో అలాంటి వ్యక్తి... సన్యాసం తీసుకోకుండా కర్మచేసినా... అతనే నిష్కామ కర్మయోగి. ఇలాంటి వారు కర్మ ఆచరించినా కర్మబంధము నుండి ప్రయాస లేకుండా కైవల్యం పొందుతారు. (5:3,5,7)

## జన్మలను దూరం చేసే దైవాన్ని శరణు పొందాలి..

ఈ సంసార వృక్షం యొక్క స్వరూపాన్ని తెలుసుకోవడం శక్యంకాదు. దాని ఆద్యంతాలు దాని ఆధారము (అధిష్ఠానము) ఎక్కడో తెలియదు. బహు దృఢమైన మూలంతో కూడిన ఈ సంసార వృక్షాన్ని అసంగం అనే శస్త్రంతో ఛేదించి, ఏ పరమాత్మ వలన అనాది అయిన సంసార ప్రవత్తి కలిగిందో, ఏ పరమాత్మను పొందిన వెనుక మరల వారికి జన్మలేదో ఆ పరమాత్మను పొందే మార్గాన్ని వెతకాలి, అతనినే నేను శరణు పొందుతున్నాను.(15:3,4)

మాన మోహములు త్యజించి, సంఘ దోషాన్ని జయించి ఆత్మ జ్ఞానంలో నిలకడగా కామక్రోధాదులు లేకుండా, సుఖదుఃఖాది ద్వంద్వాలనుండి విముక్తులైన జ్ఞానులు నాశరహితమైన ఆ పరమపదాన్ని పొందుతున్నారు.(15:5)

మనస్ఫూర్తిగా ఆతనినే శరణు పొందుము. ఆయన అనుగ్రహము వలన పరమశాంతిని శాశ్వత మోక్షపదవిని సాధింప గలవు.

జీవుడస్వతంత్రుడు, అశక్తుడు. ఈశ్వరానుగ్రహము లేక స్వప్రయత్నముచే సిద్ధిని బడయజాలడు. కావుననే ఈశ్వరునకు శరణాగతుడు అవ్వాలి. (18:62.)

## ఎలాంటి వారు పరబ్రహ్మస్థితికి అధికారి అవుతారు?

నిర్మలమైన అంతఃకరణంతో, ధైర్యంతో, పట్టుదలతో తనను తాను నియమించుకుని, శబ్దాది విషయ సుఖములను, రాగద్వేషాలను వీడి ప్రౌఢ వైరాగ్యాన్ని ఆశ్రయిస్తాడు.
ఏకాంతవాసిగా, మనో వాక్కాయాలను త్రికరణాలను నిగ్రహిస్తాడు. అహంకార మమకారాలను, బలదర్పాలను, కామక్రోధాలను, భోగ్యవస్తు పరిగ్రహమును త్యజిస్తాడు.
సదా ఆత్మధ్యానిగా ఆ మహనీయుడు పరబ్రహ్మ స్థితికి అధికారి అవుతాడు. (18 : 51-53)